
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
శుక్రవారం, 5 జులై 2024
5



మణుగూరు బీటీపీఎస్‌లో గత శనివారం రాత్రి జరిగిన జనరేట్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైన వ్యవహారంలో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఘటన జరిగిన రోజునుంచి బీటీపీఎస్ ఉన్నతాధికారులతో పాటు విచారణకు వచ్చిన జెన్కో డైరెక్టర్ వరకు అందరూ ఈ ప్రమాదానికి పిడుగుపాటే కారణమని చెప్పగా తాజాగా పరిణామాలతో అది నిజం కాదని మానవ తప్పిదం వల్లనే ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగాయన్న విషయం బయటపడింది.



ప్రమాదంలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

'పిడుగు'లాంటి నిజం!

- బీటీపీఎస్ ప్రమాదంలో జరిగిందొకటి.. చెప్పింది మరొకటి?
- రెండేళ్లుగా జనరేట్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మెయింటనెన్స్ కరువు
- అందుకే ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు..
- మానవతప్పిదమే కారణమంటున్న జెన్కో అధికారులు
- వెలుగు చూస్తున్న వాస్తవాలు
- బీటీపీఎస్ అధికారుల 'పిడుగు' డ్రామాపై సర్వత్రా చర్చ

మణుగూరు, జూలై 4: జెన్కో అధికార బృందం కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి ఈ ప్రమాదం మానవ తప్పిదం వల్లే జరిగిందని, పిడుగుపాటుకు దీనికి ఎలాంటి సంబంధం లేదని నిర్ధారించినట్లు సమాచారం.. ఇందుకు సంబంధించి నివేదికలను కూడా ప్రభుత్వానికి అందించినట్లు తెలుస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన ఘటనలో రూ.25కోట్ల నష్టం జరిగినట్లు చెబుతుండగా నష్టం అంతకుమించే ఉండొచ్చన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.

ఎవరిని కాపాడే ప్రయత్నమిది?

పిడుగుపాటు వల్లనే బీటీపీఎస్ యూనిట్-1లో జనరేట్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని సీఈ బిచ్చన్నతోపాటు థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య కూడా స్పష్టం చేయగా అసలు ఆ ఘటన జరిగిన రోజు బీటీపీఎస్ పరిసర గ్రామాల్లో ఎక్కడా భారీ వర్షం కానీ పిడుగులు గానీ పడలేదని స్థానికులు చెబుతున్నారు. బీటీపీఎస్ గోడ పక్కన నివాసం ఉండేవారు కూడా ఆ రోజు అక్కడ ఎలాంటి పిడుగు పడలేదని చెబుతున్నారు. ఈ ఘటన జరిగిన మూడు రోజుల తర్వాత ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడానికి అంతర్గత లోపాలే కారణమని జెన్కో ఉన్నతాధికారులు హైదరాబాద్‌లో స్పష్టం చేయడం అందరినీ విస్మయానికి గురి చేసింది. భారీ పిడుగు పాటును బీటీపీఎస్‌లో ఉన్న లైట్నింగ్ అరెస్టర్లు పట్టుకోలేకపోయాయని, ఈ విషయాన్ని తాము సీసీ కెమెరాల్లోనూ గుర్తించామని సీఈతో పాటు డెరెక్టర్ కూడా బల్లగుద్ది చెప్పారు. అయితే ఈ మాటాలన్నీ అబద్ధాలేనన్న విషయం స్పష్టమవుతోంది. బీటీపీఎస్ అధికారులు ఇలా ఎందుక చెప్పారని, ఎవరిని కాపాడేందుకు ఇలా మాట్లాడారన్న చర్చ జరుగుతోంది.

రెండేళ్లయినా మెయింటెనెన్స్ లేదంట

బీటీపీఎస్‌లో నిర్వహణ లోపాలు బయటపడుతున్నాయి. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు 202 నవంబర్ నుంచి డిసెంబర్ వరకు మెయిటనెన్స్ పనులు చేసిన తర్వాత మళ్లీ ఇంతవరకు ఎలాంటి నిర్వహణ పరమైన పనులు చేయలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యూనిట్లు ట్రిప్ అయిన తర్వాతైనా చిన్న చిన్న మెయిన్‌టనెన్స్ పనులు చేయాల్సి ఉండగా బీటీపీఎస్ ఉన్నతాధికారి సరైన పర్యవేక్షణ చేయకపోవడంతో ఆ పనులు కూడా చేపట్టలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సరైన నిర్వహణ, పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ లీకేజీతో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పునరుద్ధరించడమో లేక కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడమే చేయాలంటే కనిసం రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అంత వరకు యూనిట్-1 బ్రేక్‌లో ఉండాల్సి ఉంటుంది.

బాధ్యులపై చర్యలు లేనట్లేనా ?

బీటీపీఎస్‌లో జరిగిన ప్రమాదంపై విచారణ జరిగేనా బాధ్యులపై చర్యలు శూన్యమేనా అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. చిన్నచిన్న పొరపాట్లకే సంస్థ నిబంధనల మేరకు విచారణలు జరిపించే జెన్కో రూ.కోట్లల్లో నష్టం జరిగిన ఈ ట్రాన్స్‌ఫార్మర్ వ్యవహారంపై ఎలా స్పందిసుందో వేచి చూడాల్సిందే. విద్యుత్ ఉత్పాదన రంగంలో ఉన్న ఈ స్టేషన్‌లో సరైన పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని, ఉన్నతస్థాయి అధికారుల పనితీరు సరిగా ఉంటే కిందిస్థాయి అధికారులు కూడా బాధ్యతాయుతంగా పనిచేస్తారనే అభిప్రాయాలు

(మిగతా 6వ పేజీలో)

వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే కొత్త రోగం అంటకట్టేలా ఉంది వ్యవస్థ పనితీరు.. చికిత్సకోసం వచ్చిన రోగులు ఆసుపత్రిలో పేరు నమోదు చేయించుకునేందుకు యుద్ధం చేసినంత పని అవుతోంది. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల ఓపీ నమోదు కష్టాలు వర్ణనాతీతం. ప్రస్తుతం ఆన్‌లైన్ ఓపీ రావడంతో సహాయ కేంద్రం వద్ద ఆధార్ నంబర్‌తో పాటు వ్యక్తిగత వివరాలను నమోదు చేయడానికి ఒక రోగికి మూడు, నాలుగు నిమిషాల సమయం పడుతోంది. రోగులు ఎక్కువ సంఖ్యలో ఉంటే ఓపీ నమోదు చేసుకోవడానికి అరగంట నుంచి గంట వరకు సమయం పడుతోంది.



ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో ఓపీ కోసం బారులు

'ఓపి'క లేదు

- ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో ఓపీ కష్టాలు
- పేరు నమోదుకే గంట సమయం
- ఆన్‌లైన్ వ్యవస్థతో మరింత ఆలస్యం
- తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్న రోగులు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 4: వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే కొత్త రోగం అంటకట్టేలా ఉంది వ్యవస్థ పనితీరు.. చికిత్సకోసం వచ్చిన రోగులు ఆసుపత్రిలో పేరు నమోదు చేయించుకునేందుకు యుద్ధం చేసినంత పని చేయాల్సి వస్తోంది. ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల ఓపీ నమోదు కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గతంలో ఖమ్మం జిల్లా ఆసుపత్రికి వచ్చినవారు ముందు సహాయ కేంద్రం వద్ద పేరు నమోదు చేయించుకొని అక్కడి నుంచి వైద్యుడి వద్దకు వెళ్లి చికిత్స పొందేవారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ఓపీ రావడంతో సహాయ కేంద్రం వద్ద ఆధార్ నంబర్‌తో పాటు వ్యక్తిగత వివరాలను నమోదు చేయడానికి ఒక రోగికి మూడు, నాలుగు నిమిషాల సమయం పడుతోంది. రోగులు ఎక్కువ సంఖ్యలో ఉంటే ఓపీ నమోదు చేసుకోవడానికి అరగంట నుంచి గంట వరకు సమయం పడుతోంది. అప్పటి వరకు వరుసలో ఉండాల్సి వస్తోంది.

ఆధార్‌తో అనుసంధానం నామమాత్రమే..

ఆధార్ నంబర్‌తో చాలా ప్రభుత్వ శాఖల్లో వ్యక్తిగత వివరాలు ఆటోమెటిక్‌గా వస్తాయి. ఆధార్ నంబర్ నమోదు చేయగానే పూర్తి వివరాలు వస్తుండడంతో అక్కడ వారికి ప్రజలకు సేవలందించడం సులభం అవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలకు ఆధార్ సాంకేతికను అనుసంధానం చేశారు. క్షణాల్లో రోగులకు ఆన్లైన్ ఓపీ పత్రం ఇవ్వొచ్చు. గుంపులుగా జనాలు ఉండడంతో వ్యాధులు ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదముంది. ఆధార్ సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చినా దానిపై అవగాహన లేకపోవడంతో నిరుపయోగంగా మారింది.

ఓపీ వద్ద బారులుదీరిన రోగులు

ఖమ్మం జిల్లా జనరల్ ఆసుపత్రిలో గురువారం రోగులు బారులు తీరారు. ఒక్క రోజే కనీసం 2 వేల మంది వచ్చినట్లు సమాచారం. నమోదు కేంద్రంలో వేర్వేరుగా రెండు కంప్యూటర్లు ఏర్పాటు చేయడంతో దివ్యాంగులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. అన్ని సర్కారు ఆసుపత్రుల్లో వైద్యుల విధి నిర్వహణ పటిష్ఠం చేయడంతో పాటు రోగులు ఎక్కడికి వెళ్లినా వారికి చికిత్స అందేలా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. అన్ని ఆసుపత్రులకు ఇంటర్నెట్ సదుపాయంతోపాటు కంప్యూటర్లు, ప్రింటర్లు అందజేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి పేరు, తండ్రి పేరు, ఆధార్ నంబర్, సెల్‌నంబర్, గ్రామం, మండలం, జిల్లా, సమస్య, అన్నీ నమోదు చేసిన తర్వాత ఆన్‌లైన్‌లో వివరాలతో ఒక సీఆర్ (సెంట్రలైజ్డ్ రిజిస్ట్రేషన్) నంబర్ వస్తుంది. దీనినే ప్రింట్ తీసి రోగికి ఇస్తున్నారు. అయితే రోగి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి అధిక సమయం పడుతోంది. వరుసలో నిల్చున్న రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆసుపత్రిలో కానరాని సహాయకులు..

జిల్లా ఆసుపత్రికి వచ్చే వారికి ఆదిలోనే కష్టాలు తప్పడం లేదు. ఆసుపత్రికి వచ్చిన రోగులు వారి బంధువులు నిస్సహాయ స్థితిలో ఉన్న వారిని లోనికి తీసుకెళ్లడానికి పేషంట్ కేర్లు (సహాయకులు) లేకపోవడంతో రోగి బంధువులే స్ట్రెచర్‌పై, చక్రాల కుర్చీలపై తీసుకెళ్లాల్సి వస్తోంది. గత కొద్ది రోజులుగా జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులకు ఈ దుస్థితి తప్పడం లేదు. ఆసుపత్రి అధికారుల రోగుల ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదాల్లో గాయపడిన వారు, తీవ్ర అస్వస్థతకు గురైన వారు ఒక్కరే వస్తే ఇక ఆ రోగి కష్టాలు వర్ణనాతీతంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు ఓపీ కష్టాలు తీర్చాలని, ఇతర సౌకర్యాలను మెరుగు పరచాలని ప్రజలు కోరుతున్నారు.

రైతు ఆత్మహత్య కేసులో వీడియో తీసిన
యువకుడి లొంగుబాటు

ఖమ్మం క్రైం జూలై 4: చింతకాని మండల ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన రైతు బోజెడ్ల ప్రభాకర్ ఆత్మహత్య చేసుకున్న వ్యవహారంలో రైతు మాట్లాడిన వీడియో తీసిన యువకుడు గురువారం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఆత్మహత్యకు ముందు రైతు మాట్లాడిన ఈ వీడియో సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారమైంది. అయితే పోలీసులు ఆ వీడియో రైతు తనకు తాను తీసుకోలేదని ఓ యువకుడు దాన్ని రికార్డు చేసినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో సదరు యువకుడు అప్పటినుంచి పరారీలో ఉన్నాడు. అయితే ఆ యువకుడు గురువారం ఖమ్మం అర్బన్ పోలీస్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది. సదరు యువకుడిని విచారించిన పోలీసులు ఈ కేసులో చింతకాని మండలానికి చెందిన ఓ నాయకుడిని కూడా స్టేషన్‌కు పిలిపించి గురువారం విచారణ చేసినట్లు సమాచారం. కానీ ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు. మరో రెండురోజుల్లో ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించే అవకాశం ఉంది.

డయల్ 100కు
4,469 కాల్స్

ఖమ్మంక్రైం, జూలై 4: సమాజంలో పెరిగిపోతున్న నేరప్రవృత్తి నేపథ్యంలో ప్రజల ధన, మాన ప్రాణాల రక్షణే ధ్యేయంగా ఏర్పాటైన డయల్ 100కు జూన్‌లో 4,469 కాల్స్ వచ్చాయని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. వాటిపై విచారణ చేసి 101 కేసులు నమోదు చేసినట్లు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో హత్యాయత్నం 1, మహిళలపై వేదింపులు 8, దొంగతనాలు 19, సాధారణఘాతాలు 28, యాక్సిడెంట్లు 17, అనుమానస్పద మరణాలు 4, ఇతర కేసులు 24 ఉన్నాయని సీపీ ఆ ప్రకటనలో తెలిపారు. కొంతమంది వ్యక్తులు డయల్ 100గురించి అవగాహన లేక ఫేక్‌కాల్స్ చేస్తున్నారని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని సీపీ సూచించారు.

రామయ్య భూముల్లో
మళ్లీ అక్రమ నిర్మాణాలు

భద్రాచలం జూలై 4: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి సంబంధించి ఏపీలోని అల్లూరి జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నంలోని రామయ్య భూముల్లో మళ్లీ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. దేవస్థానం నిర్మిస్తున్న శ్రీగోకులరామం ఎదురుగా అక్రమ నిర్మాణం చేపడుతుండగా సమాచారం అందుకున్న దేవస్థానం అధికారులు గురువారం వారిని అడ్డుకునేందుకు వెళ్లారు. దేవస్థానం పర్యవేక్షకులు నిరంజన్‌కుమార్ తమ సిబ్బందితో అక్కడికి వెళ్లి అక్రమ నిర్మాణాలను ఆపేందుకు ప్రయత్నించగా ఆక్రమణదారులు వారిని అడ్డుకనే ప్రయత్నం చేసినట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి.

బంద్ ప్రశాంతం

- పలుచోట్ల విద్యార్థి సంఘాల ర్యాలీ
- భద్రాద్రి జిల్లా విద్యార్థి నాయకుల ముందస్తు నిర్బంధం

ఖమ్మం ఖానాపురంహవేలీ/కొత్తగూడెం, జూలై 4(ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష పేపర్ లీక్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గురువారం బీజేపీయేతర విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యాసంస్థల బంద్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. బంద్ సందర్భంగా అనేక పాఠశాలలు, కళాశాలలను ముందే మూసివేశారు. పలుచోట్ల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై కేంద్ర ప్రభుత్వం సీబీఐతో కాకుండా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బంద్ నిర్వహించినట్లు తెలిపారు. నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించి నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యా సంస్థల బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు స్వచ్ఛందంగా మూసివేయటంతో బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ బంద్‌లో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ బంద్ విజయవంతమైంది. అయితే బంద్ సందర్భంగా ఈ జిల్లాలో పలువురు విద్యార్థి నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని నిర్బంధించారు. దీనిపై విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి.

'అక్రమ నిర్బంధాన్ని ఖండించాలి'..

దేశ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు బయ్యా అభిమాన్యు, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ, ఎస్ఎఫ్ఐ జిల్లా మిటీ సభ్యులు యశ్వంత్, ప్రవీణ్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు వంశీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులను యువజన సంఘాల నాయకులను పోలీసులు ఉదయం 4గంటలకే అదుపులోకి తీసుకొని నిర్బంధించారు. పోలీసుల చర్యలను పలువురు విద్యార్థి నాయకులు ఖండించారు. పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించి విద్యార్థి నాయకులను అరెస్టులు చేసి రోజంతా మానసికంగా ఇబ్బందులు పెట్టారాన్నారు. కిన్నెరసాని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్‌ను పోలీసులు భయభ్రాంతులకు గురి చేశారని, మధ్యాహ్నం 3గంటల వరకు కనీసం భోజనం కూడా పెట్టలేదని ఆరోపించారు. పలుచోట్ల కేసులు పెడతామని మానసికంగా బెదిరించారన్నారు. కొందరిపై తప్పుడు కేసులు బనాయించారని ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ అరెస్టులు, కేసులను నిరసిస్తూ నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తున్నట్లు తెలిపారు.



విద్యాసంస్థల బంద్ సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



మంత్రి తుమ్మలను కలిసిన ఏపీకి చెందిన విలీన పంచాయతీవాసులు

అందరి నోట
అదేమాట

- ఆ ఐదు భద్రాద్రిలో విలీనం చేయండి
- ముఖ్యమంత్రుల భేటీలో సమస్య కొలిక్కి వచ్చేనా?
- నేడు సీఎం రేవంత్‌ను కలవనున్న విలీన పంచాయతీల అఖిలపక్షం

భద్రాచలం, జూలై 4: రేపు హైదరాబాద్‌లో జగనున్న రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీకి ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. పదేళ్లుగా అపరిష్కతంగా ఉన్న విభజన సమస్యలపై చర్చ జరగనున్న నేపథ్యంలో భద్రాద్రి సరిహద్దున ఏపీలో విలీనమైన ఐదు పంచాయతీల ప్రజలు తమను మళ్లీ తెలంగాణలో విలీనం చేయాలని ముక్తకంఠంతో కోరుతున్నారు. ప్రధాన రాజకీయపక్షాలు సైతం ఇదే స్వరాన్ని వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తమ గోడును చెప్పుకునేందుకు ఐదు పంచాయతీల సర్పంచ్‌లు, అఖిలపక్షం నాయకులు గురువారం తరలివెళ్లారు.

శుక్రవారం వారు సీఎం రేవంత్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించనున్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఐదు పంచాయతీలను తెలంగాణలోకి తెస్తామంటూ హామీ ఇచ్చింది. భద్రాచలం ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలు సైతం ఐదు పంచాయతీలను భద్రాద్రిలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గురువారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి సహకరించాలని కోరారు.

మరోవైపు అపరిష్కృతంగా ఉన్న విభజన సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం లేఖ రాశారు.

ఆ ఐదు పంచాయతీలను
తెలంగాణలో కలపాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ

వివరాలు : 6లో



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం



పొలంలోనే గడ్డి నివారణ మందుతాగిన రైతు భద్రయ్య

భూమి కబ్జా చేశారని
రైతు ఆత్మహత్యాయత్నం

- ఆర్టీఐ మాజీ అధికారిపై ఆరోపణలు
- కారేపల్లి మండలంలో ఘటన

6



ఎండు మిర్చికి ధరాఘాతం

- ఖమ్మం మార్కెట్‌లో ఒక్క రోజే క్వింటాలుకు రూ.2,000 డౌన్
- కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్న రైతుల ఆశలు ఆవిరి

6

తెలంగాణ సాయుధపోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య

▸ భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్



కొత్తగూడెంలో నివాళులర్పిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్



ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్‌పై నివాళులర్పిస్తున్న డీఆర్‌డీవో

కొత్తగూడెం/పాల్వంచ రూరల్/ఖమ్మంకార్పొరేషన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధపోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో దొడ్డి కొమరయ్య వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం, విముక్తి పోరాటాన్ని చేసిన మహనీయుడు కొమరయ్య అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం మాట వినపడగానే మొదట గుర్తుకొచ్చేది దొడ్డి కొమరయ్య పేరేనన్నారు. దొరల దురాగతాలను ఎదురించిన గొప్పవీరుడు దొడ్డి కొమరయ్య అన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, బీసీ సంక్షేమ అధికారిని ఇందిర, జిల్లా ఉపాధి కల్పన అధికారి విజేత, పరిపాలన అధికారి గన్య, కురుమ సంఘ సభ్యులు సీహెచ్.సాయిలు, జి.కిరణ్‌కుమార్, కొల్లి సాయికుమార్, పోలే జగదీష్, కోటిలింగం, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దొడ్డికొమరయ్య ఆశయాన్ని నెరవేరుద్దాం: గుమ్మడి నర్సయ్య

తెలంగాణ సాయుధపోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమరయ్య ఆశయాన్ని నెరవేరుద్దామని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. గురువారం మండలంలోని కేపీ జగన్నాథపురంలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైజాం నవాబులకు ఎదురొడ్డి నిలిచి తెలంగాణ ప్రజల ఆత్మాభిమానాన్ని నిలపెట్టిన వ్యక్తి అని కొనియాడారు. కమ్యూనిస్టు దళాల్లో పనిచేస్తూ నైజాం నవాబులను తరిమికొట్టిన వ్యక్తి దొడ్డి కొమరయ్య అని అన్నారు. నైజాం సాయుధ బలగాలు మూకుమ్మడి దాడుల్లో దొడ్డి కొమరయ్య మృతిచెందారని ఆయన త్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు కె.రంగయ్య, మాస్‌లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు, భద్రాద్రి జిల్లా నాయకులు ముద్దా భిక్షం, ప్రభాకర్‌రావు, బి.కల్పన, రాము, నూపా భాస్కర్, నిమ్మల రాంబాబు పాల్గొన్నారు.

భూ విముక్తి కోసం ప్రాణాలొడ్డిన యోధుడు

తెలంగాణా సాయుధ పోరాటంలో భూ మిముక్తి కోసం ప్రాణాలు ఒడ్డిన యోధుడు దొడ్డి కొమరయ్య అని స్థానికసంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో సన్యాసయ్య పేర్కొన్నారు. దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న దొడ్డి కొమరయ్య విగ్రహం వద్ద చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కొమరయ్య విగ్రహానికి అధికారులు, బీసీ సంఘాల నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణా సాయుధ పోరాట చరిత్రలో దొడ్డి కొమరయ్య చేసిన ప్రాణత్యాగం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కొందరి వద్దే ఉన్న వేలాది ఎకరాలను వారి కబంధహస్తాల నుంచి విముక్తి చేసి పేదలకు పంచడంలో ముఖ్య ప్రాత్ర వహించారన్నారు. ఆ పోరాటంలో ప్రాణాలను తృణప్రాయంగా పరిత్యజించారన్నారు. అప్పటికాలంలో భూస్వాములను ఎదురించలేని పరిస్థితులు నెలకొన్నా, పేదలకు భూమి పంచి, వారిని వెట్టిచాకిరినుంచి విముక్తి చేయాలనే ఆశయంతో ప్రాణాలను ఫణంగా పెట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిని జ్యోతి, ఏబీసీడీవో మందుల ఈదయ్య, జిల్లా బీసీ సంఘాల నాయకులు కూరాకుల నాగభూషయ్య, పిండిప్రోలు రామ్మూర్తి, బమ్మిడి శ్రీనివాస్, అమరగాని వెంకన్న, సీహెచ్.మల్లేశం, ఉపేందర్, షకీనా, జ్యోత్స్నానాయక్, పగడాల నాగరాజు, కన్నం ప్రసన్న కృష్ణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

9 నుంచి 'సదరం' క్యాంపులు

సెప్టెంబర్ 24 వరకు శిబిరాల నిర్వహణ

ఖమ్మం కలెక్టరేట్, జూలై 4: జిల్లావ్యాప్తంగా దివ్యాంగులకు సదరం శిబిరం ద్వారా జారీ చేసే వైకల్య నిర్ధారణ ధ్రువీకరణ పత్రాలు ఉంటేనే గుర్తింపు లభిస్తుంది. దీని ద్వారానే దివ్యాంగులు పలు ప్రయోజనాలు పొందే ఆస్కారం ఉంటుంది. పుట్టుకతో అంగవైకల్యం, నరాల బలహీనత, కంటిచూపు లోపం, వినికిడి సామర్థ్యం కోల్పోవడం, మతిస్థిమితం కోల్పోయిన వారు, యాసిడ్ దాడులకు గురైన వారు శిబిరానికి హాజరైతే వైద్య బృందం పరీక్షలను నిర్వహించి నెలరోజుల్లో గుర్తింపు పత్రాన్ని జారీ చేస్తుంది. రహదారి ప్రమాదాల్లో గాయపడి వికలత్వం పొందిన వారికి ఇది వర్తిస్తుంది.

9 నుంచి సెప్టెంబర్ 24 వరకు

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూలై 9నుంచి సెప్టెంబర్ 24 వరకు నిర్ణయించిన తేదీల ప్రకారం సదరం క్యాంపులను నిర్వహించి ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయనున్నట్టు జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ తెలిపారు. మీసేవా కేంద్రాల్లో సదరం వైకల్యం అంచనా ధ్రువీకరణ పత్రం కోసం స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌ఫొటోని మీసేవ కేంద్రానికి తీసుకెళ్లాలి. స్లాట్ బుకింగ్ ప్రకారం దరఖాస్తుదారుడు మీ సేవ రశీదుతోపాటు మెడికల్ క్యాంపునకు హాజరవ్వాల్సి ఉంటుంది. వైద్యులు క్యాంపుల్లో పార్ట్-ఎ వివరాలను ఆమోదించి సదరం గుర్తింపు సంఖ్య నమోదు చేస్తారు. మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ శుక్రవారం నుంచి ప్రారంభం అవుతుందని తెలిపారు.

సందరం క్యాంపుల తేదీలు ఇవీ..

జూలై 9, 16, 23, 30, ఆగస్టు 6, 13, 20, 27, సెప్టెంబరు 3, 10, 17, 24 తేదీల్లో సదరం క్యాంపులను ఖమ్మంలోని ప్రధాన ఆస్పత్రిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు, దివ్యాంగులు సద్వినియోగించుకోవాలని డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ కోరారు. గతంలో గాంధీ విగ్రహం వద్ద ఉన్న క్యాంపులో కాకుండా గతంలో ఆయుర్వేద క్లినిక్‌లో సదరం క్యాంపును నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

సీహెచ్‌సీ, క్వార్టర్ల నిర్మాణాలను పరిశీలించిన డైరెక్టర్ (పా) ఆపరేషన్



క్వార్టర్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న దృశ్యం

కొత్తగూడెం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో పునరావాసం కోసం ఇచ్చే కాలనీని, కొత్తగూడెంలో నూతనంగా నిర్మించే సీహెచ్‌సీ, ఉద్యోగుల నివాసం కొరకు నూతనంగా నిర్మిస్తున్న క్వార్టర్ల నిర్మాణాలను, జీఎం కార్యాలయాన్ని గురువారం సింగరేణి డైరెక్టర్ పా (ఆపరేషన్స్) ఎన్‌ఈకే శ్రీనివాస్ ఆకస్మికంగా పరిశీలించారు. కొత్తగూడెంలోని గంగాహుస్సేన్‌బస్తీలో ప్రతిపాదిత వీకేవోసీ విస్తరణలో భాగంగా రుద్రంపూర్‌లోని ఎస్‌ఆర్‌టీ, వనమానగర్, మాయాబజారులో ఇళ్లను కోల్పోయే వారికి పునరావాసం కొరకు ఇచ్చే కాలనీని సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. పవర్, వాటర్, డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసి స్థలం పొందిన వారికి అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మాయాబజారు ప్రాంతంలో బొగ్గు రవాణా కొరకు నూతనంగా నిర్మించబోయే కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, రైల్వేసైడింగ్ ప్రదేశాన్ని పరిశీలించి నిర్మాణ పనుల గురించి సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు, అధికారుల నివాసం కోసం గౌతంపూర్, త్రీ ఇంక్లైన్ ఏరియాలో ఆధునాతనంగా నిర్మించే 353 క్వార్టర్ల (ఎండీ 210, ఎంసీ 60, ఎంబీ48, ఎంఏ 28 (ఇండిపెండెంట్ ఆరు జీఎం బంగ్లా 1 నిర్మాణ పనులను పరిశీలించారు. నూతన క్వార్టర్లలో అన్ని సదుపాయాలను కల్పించాలని, కాలనీల్లో సౌర విద్యుత్‌లైట్స్‌ను ఏర్పాటు చేయాలని మొత్తం కాలనీలో మొక్కలను నాటి గ్రీన్‌టౌన్‌షిప్‌గా మార్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజు, జీ.ఎం (సివిల్) టి. సూర్యనారాయణ, ఏజీఎం (సివిల్) రామకృష్ణ, ఈకే ఓసీ పీవో శ్రీరమేష్, డీజీఎం సూర్యనారాయణ, డీజీఎం సదానందం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అధికారులు సమయం పాటించాలి

▸ భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్



కుమారిని అభినందిస్తున్న పీవో

భద్రాచలం, జూలై 4: ఐటీడీఏలోని కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించి తమ విధులు సక్రమంగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో రాహుల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన సమావేశ మందిరం, రెండో అంతస్తులోని విభాగాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గిరిజనుల కుటుంబాలను ఆర్థికాభివృద్ధి దిశగా తీసుకొని వెళ్లడానికి, విద్య, వైద్యం గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడానికి ఐటీడీఏను నెలకొల్పడం జరిగిందన్నారు. ప్రతి కార్యాలయం గదులు శుభ్రంగా చూపరులకు కనువిందు చేసేలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు, ఈఈ తానాజీ, డీఎస్‌వో ప్రభాకర్ రావు, మేనేజర్ ఆదినారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ క్రీడాకారిణి కుమారిని అభినందించిన పీవో

జాతీయస్థాయిలో రన్నింగ్ విభాగంలో పాల్గొని అనేక గోల్డ్ మెడల్స్ సాధించి, రాబోయే అంతర్జాతీయ టోర్నమెంట్ కోసం చత్తీస్‌గఢ్‌లోని బిలాయికి శిక్షణ కోసం వెళ్తున్న పాయం కుమారిని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అభినందించారు. 2022లో రాష్ట్ర స్థాయి క్రీడల్లో గోల్డ్‌మెడల్, 2023లో అస్సాంలో జరిగిన జాతీయ స్థాయి రన్నింగ్ పోటీల్లో పాల్గొంది. ప్రస్తుతం 200మీటర్ల రన్నింగ్ రేసు శిక్షణకోసం కోచ్ భగత్ నేతృత్వంలో అథ్లెటిక్స్ క్లబ్‌లో శిక్షణ తీసుకుంటోంది. ఈ బాలికకు ఐటీడీఏ తరఫున సహాయ సహకారాలు పూర్తిగా అందిస్తామని పీవో తెలిపారు.

ప్రభాకర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

కలెక్టర్‌ను కలిసిన జడ్పీ చైర్మన్



కలెక్టర్‌ను కలిసిన జడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 4: చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో ఇటీవల పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న బోజడ్ల ప్రభాకర్ కుటుంబంతో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు గురువారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభా కర్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ప్రభాకర్ పాస్‌బుక్ ఆధారంగా అతని భూమి ఆయన కుటుంబానికి ఇప్పించాలని కోరారు. రైతు ఆత్మ హత్యపై సత్వరమే విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర కార్యదర్శిగా చారుగుండ్ల

▸ టీఆర్ఎస్‌తో బంధాన్ని తెంచుకున్న టీఆర్‌వీకేఎస్..

▸ గౌరవ సలహాదారుగా కల్వకుంట్ల కవిత తొలగింపు

పాల్వంచ, జూలై 4: టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర కార్యదర్శిగా పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌కు చెందిన చారుగుండ్ల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమ ప్రియతమ నాయకుడు రాష్ట్ర పదవిని అలంకరించి పాల్వంచ వచ్చిన సందర్భంగా గురువారం యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కర్మాగారంలో ఘన స్వాగం పలికారు. శాలువాలతో సత్కరించారు. బుధవారం హైదరాబాద్‌లో టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సీఈసీ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా టీఆర్ఎస్ పార్టీకి అనుబంధంగా వ్యవహరిస్తున్న టీఆర్‌వీకేఎస్ కార్మిక సంఘం ఇక మీదట స్వతంత్ర్యంగా వ్యవహరించాలని కమిటీ తీర్మానించింది. అదేవిధంగా యూనియన్ గౌరవ సలహాదారుగా వ్యవహరిస్తున్న కల్వకుంట్ల కవితను తప్పించి ఆమె స్థానంలో మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోదూరి ప్రకాష్‌ను నియమించారు. ఈ రెండు పరిణామాలపై ఆంధ్రజ్యోతి ముందే చెప్పింది. మార్చి 27న టీబీజీకేఎస్ బాటలో టీఆర్‌వీకేఎస్ అనే కథనాన్ని ప్రచురించింది.



చారుగుండ్లను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

ఎండు మిర్చికి ధరాఘాతం

▸ ఖమ్మం మార్కెట్‌లో ఒక్క రోజే క్వింటాలుకు రూ.2,000 డౌన్ ▸ కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్న రైతుల ఆశలు ఆవిరి ▸ నాన్‌ఏసీ మిర్చి ధరలూ పతనం

ఖమ్మం మార్కెట్, జూలై 4: తేజా రకం ఏసీ మిర్చి ధరలు రోజురోజుకు పడిపోతున్నాయి. ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో తేజా రకం ఏసీ మిర్చితో పాటు సాధారణ రకం నాన్ ఏసీ మిర్చి ధరలు కూడా భారీగా పడిపోయాయి. మార్కెట్‌లో గురువారం కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచిన మిర్చికి క్వింటా రూ.17,500ల జెండాపాట ధర నిర్ణయించగా వ్యాపారులు నాణ్యతను బట్టి క్వింటాలు రూ.15,000 నుంచి రూ.16,000 వరకు కొనుగోలు చేశారు. ఇదే మార్కెట్‌లో బుధవారం క్వింటా ఏసీ మిర్చి రూ.19,500 జెండాపాట పలికిన మిర్చి ధర ఒక్క రోజులోనే క్వింటాలుకు రూ.2వేలు తగ్గింది. నెల రోజుల క్రితం ధరతో పోలిస్తే క్వింటాలుకు సుమారు రూ.3,000లకు పైగా ధర తగ్గింది. ఇక మార్కెట్లో సాధారణ రకం నాన్‌ఏసీ మిర్చి ధరలు మరింత పతనమయ్యాయి. క్వింటాలు ఎండు మిర్చి రూ.10,000నుంచి రూ.14,000 వరకు పలుకుతోంది. ఇదిలా ఉండగా చైనా, సింగపూర్, మలేషియా, థాయిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలకు తేజా రకం మిర్చి ఎగుమతులు నిలిచిపోవడం వల్లనే ధరలు తగ్గుముఖం పడుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా ఖమ్మం పరిసర ప్రాంతాల్లో పండిన తేజా మిర్చిలో ఆయిల్ ఎక్కువగా వస్తుందని చైనా వ్యాపారులు బల్క్ ఆర్డర్లు ఇస్తుంటారు. కానీ ప్రస్తుతం అక్కడినుంచి ఎటువంటి ఆర్డర్లు లేకపోవడంతో పాటు ఇతర దేశాలనుంచి సైతం ఆర్డర్లు లేకపోవడంతో ధరలు తగ్గుతున్నాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ఖమ్మం మార్కెట్‌కు గురువారం సుమారు 3 వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. ధరలు తగ్గుతుండడంతో రైతులు కోల్డ్‌స్టోరేజీల్లో తమ పంటను విక్రయించేందుకు విముఖత చూపుతున్నారు.



కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన రైతుల ఆశలు ఆవిరి

మార్కెట్‌లో గత మార్చి, ఏప్రిల్ నెలల్లో క్వింటాలుకు రూ.16-17వేలు ధర పలికితే గిట్టుబాటు కావట్లేదని చాలా మంది రైతులు తమ పంటను కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేశారు. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో అదే పంటకు క్వింటాలుకు రూ.15,000 నుంచి రూ.16,000 మాత్రమే ధర పలుకుతుండడంతో ఉసూరుమంటున్నారు. అప్పుడే పంట అమ్ముకున్నా ఈ దుస్థితి వచ్చేది కాదని మదనపడుతున్నారు. అప్పటి రేటుతో పోలిస్తే ప్రస్తుతం క్వింటాలుకు రూ.1,000 నుంచి రూ.2,000వరకు నష్ట పోవడమే కాకుండా కోల్డ్‌స్టోరేజీ కిరాయి, ఎగుమతి దిగుమతి, హమాలీ ఖర్చులు సహా మరో రూ.1,000 మొత్తం క్వింటాలుకు రూ.3వేల వరకు నష్ట పోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ (వానాకాలం పంట) సాగు సీజన్ ప్రారంభం కావడంతో తప్పని సరి పరిస్థితుల్లో పెట్టుబడి అవసరాలకోసం నష్టానికైనా పంటను అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్‌సీజన్‌లో ధర పెరుగుతుందని భావించిన రైతుల ఆశలు అడియాశలయ్యాయి.

భూమి కబ్జా చేశారని రైతు ఆత్మహత్యాయత్నం

▸ ఆర్టీఐ మాజీ అధికారిపై ఆరోపణలు

▸ ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో ఘటన

కారేపల్లి జూలై 4: తన భూమిని కబ్జా చేశారని ఆరోపిస్తూ గురువారం ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో ఓ రైతు ఆత్మహత్యకు యత్నించాడు. కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి పంచాయతీ హల్యాతండాకు చెందిన పచ్చిపాల భద్రయ్య అనే రైతుకు అదే గ్రామంలో 1 ఎకరం 20కుంటల భూమి ఉంది. అయితే ఆ భూమిని గత ప్రభుత్వ హయాంలో ఆర్టీఐలో ఉన్నతాధికారిగా పనిచేసిన ఓ వ్యక్తి కబ్జా చేశాడని బాధిత కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. గురువారం సదరు వ్యక్తికి సంబంధించిన కొందరు ఆ భూమిలో దుక్కి దున్నుతున్నతుండగా రైతు భద్రయ్య అతడి కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ భూమి వ్యవహారం గత కొంతకాలంగా కోర్టులో ఉన్నందున దుక్కి దున్నడానికి వీలు లేదని రైతు భద్రయ్య వారిని అడ్డుకున్నాడు. దాంతో వారు భద్రయ్యను పక్కకు నెట్టేశారు. దాంతో మనస్థాపానికి గురైన రైతు పొలంలోనే గడ్డినివారణ మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం భద్రయ్య పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు.

ఇదిలా ఉండగా గతేడాది డిసెంబరు వరకు ఆర్టీఐ కమిషనర్‌గా పనిచేసిన సదరు వ్యక్తి కారేపల్లి ప్రాంతంలో పలువురి భూములను సైతం కబ్జా చేసినట్లు బాధిత రైతులు ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులు, పోలీసుల సహకారంతో అతడు రైతులను బెదిరించాడని, ప్రస్తుతం అధికార అండలేకున్నా అదే ధోరణితో రైతులను బెదిరిస్తున్నాడని రైతులు వాపోయారు. వరంగల్ జిల్లాకు చెందిన సదరు వ్యక్తి కారేపల్లి మండల పరిధిలోని హల్యాతండాకు చెందిన కొంత మంది రైతులకు చెందిన భూములను కొనుగోలు చేశాడు. అయితే అతడు కొన్న భూమి పక్కనే ఉన్న భద్రయ్య భూమిని కూడా తనకు విక్రయించాలని ఒత్తిడి తెచ్చాడు. అయితే అతడు విక్రయించేందుకు నిరాకరించడంతో 1 ఎకరం 20కుంటల భూమిని కబ్జా చేసినట్లు రైతు భద్రయ్య కుటుంబసభ్యులు తెలిపారు. ఈ విషయంపై గతేడాది భద్రయ్య కోర్టుకు వెళ్లాడు. అప్పటినుంచి ఈ వ్యవహారం కోర్టులోనే నడుస్తోంది. రైతు ఆత్మహత్యాయత్నం విషయం తెలుసుకున్న కారేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు.

'పిడుగు'లాంటి నిజం!

(5వ పేజీ తరువాయి)

వ్యక్తమవుతున్నాయి. కోట్ల నష్టం జరిగిన ఈ వ్యవహారంలో జెన్కో అధికారులు విచారణ చేపట్టి ఎవరిని బాధ్యులను చేస్తారో వేచి చూడాల్సిందే. ప్రభుత్వానికి అందిన నివేదికలపై విద్యుత్‌శాఖ మంత్రి ఎలా స్పందిస్తారోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

మసిపూసి మారెడు కాయచేద్దామనుకున్నారా ?

బీటీపీఎస్‌లో శనివారం జరిగిన ప్రమాదాన్ని సీఈ ఎందుకు కప్పిపుచ్చే ప్రయత్నం చేశారన్నదానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. సీఈ స్థాయి అధికారికి ట్రాన్స్‌ఫార్మర్ ఎందుకు కాలిపోయిందో తెలియనిదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. చుట్టూ ఎత్తైన భవనాలు, కట్టడాలు ఉన్నా పిడుగు వాటిపై పడకుండా కేవలం 10 అడుగుల ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై ఎలా పడిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతే కాకుండా లైట్నింగ్ అరెస్టర్లు పనిచేయలేదనే వాదనపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముందు పిడుగు వల్లనే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందన్న సీఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా ఓపెన్ చేసి పరిశీలించిన తరువాత ఆయిల్ లీకేజీ కారణంగానే ప్రమాదం జరిగిందని తేలడంతో సీఈ మాట మార్చినట్లు తెలిసింది. చివరికి ఆయన సాంకేతిక లోపాల వల్లే ప్రమాదం జరిగిందని చెప్పడం కొసమెరుపు.. నిర్మాణ సమయం నుంచే అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న బీటీపీఎస్‌కు తాజా ఘటన మరింత చెడ్డపేరు తిసుకొచ్చిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

సీపీఐ రాష్ట్ర నేత అయోధ్యకు గుండెపోటు

మణుగూరు, జూలై 4 : సీపీఐ పార్టీ రాష్ట్ర నేత బొల్లోజు అయోధ్య చారి గురువారం గుండెపోటుకు గురయ్యారు. అస్వస్థతకు గురైన అయోధ్యను వెంటనే భద్రాచలంలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు పేర్కొన్నట్లు మండల సీపీఐ పార్టీ నాయకులు తెలిపారు.

అల్లూరి సీతారామరాజు ఆశయాలు సాధించాలి

● ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



ప్రదర్శన నిర్వహిస్తున్న క్షత్రియ సేవా సమితి సభ్యులు

మణుగూరు, జూలై 4: అల్లూరి సీతారామరాజు ఆశయాలు సాధించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురు వారం మణుగూరులో ప్రధాన రహదారిపై మండల క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అలాగే అల్లూరి సీతారామరాజు 127 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు పిన్నమరాజు నరసింహారావు, సరస్వతి స్టీల్స్, వర్కింగ్ ప్రెసిడెంట్ దాట్ల విజయకుమార్ రాజు, సెక్రటరీ దంతులూరి రామరాజు, కోశాధికారి భూపతిరాజునరసింహామూర్తి రాజు తదితరులు తొలుగ సీతారామరాజు జయంతి విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమాలను పురస్కరించుకుని ప్రదర్శన నిర్వహించారు. దేశ స్వాతంత్ర్య తొలి పోరాటాల్లో అల్లూరి సీతారామరాజు బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా నిలిచి తన ప్రాణాలను అర్పించిన వీరుడన్నారు. మన్యం ప్రజల కోసం తనప్రాణాన్ని ఫణంగా పెట్టిన మహనీయుడన్నారు. పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, మణుగూరు సీఐ సతీష్ కుమార్, అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆ ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలి

▸ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

▸ ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ

కొత్తగూడెం, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సమయంలో ఏపీలో విలీనం చేసిన భద్రాచలం మండలంలోని ఐదు పంచాతీలను తిరిగి తెలంగాణలో కలపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని కోరారు. ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో గురువారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా దుర్మార్గంగా భద్రాచలాన్ని ముక్కలు చేసి తెలంగాణలోని ఐదు పంచాయతీలను ఆంధ్రలో విలీనం చేసిందన్నారు. దీనికి వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు, ఆయా పంచాయతీల ప్రజలు నిరసన తెలిపినా కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని ప్రజలకు అన్యాయం చేసిందన్నారు. 6వ తేదీన జరగనున్న తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో విలీన పంచాయతీలను తెలంగాణలో కలపాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లుగా తెలిపారు. భద్రాచలం పట్టణం చుట్టూ ఏపీ ప్రాంతాలే ఉండడంతో చెత్త వేసేందుకు కనీసం డంపింగ్‌యార్డు ఏర్పాటుకు కూడా అవకాశం లేకుండాపోయిందన్నారు. భద్రాచలం సమీపంలో ఏపీలో విలీనమైన పురుషోత్తంపట్నం పంచాయతీ పరిధిలో భద్రాచలం దేవస్థానం భూములు ఉన్నాయని, పర్యవేక్షణ లేకపోవడంతో అవన్నీ ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. యటపాక, పిచ్చుకలపాడు, కన్నాయిగూడెం, పంచాయతీల మీదుగా ప్రధాన రహదారి సమస్య ఉందన్నారు. పోలవరం బ్యాక్ వాటర్ వల్ల భద్రాచలం పట్టణం, రామాలయంతో పాటు బూర్గంపాడు మండలం సారపాక ఇతర గ్రామాలు ముంపు భారిన పడే అవకాశ ఉండడంతో శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. రెండు రాష్ట్రా ముఖ్యమంత్రులు విభజన సమస్యలపై మాట్లాడుకోవాలని నిర్ణయించడాన్ని సీపీఎం ఆహ్వానిస్తోందన్నారు. ఇదే సమయంలో రెండు రాష్ట్రాలకు ప్రయోజనం కలిగేలా చర్చలు జరగాని ఆయన సూచించారు. గత ప్రభుత్వం పోడు సాగుదారుల సర్వే చేసి కొంతమందికే హక్కుపత్రాలు ఇచ్చిందని, ఈ ప్రభుత్వం మిగిలిన పోడు సాగుదారులకు హక్కుపత్రాలు ఇవ్వాలని తమ్మినేని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, సీనియర్ నాయకులు కాసాని అయిలయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, ఎంబి. నర్సారెడ్డి, ఎం. జ్యోతి, కారం పుల్లయ్య, బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, జిల్లాకమిటీ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, నబీ, శ్రీనివాస్ రవి, రమేష్, వంశీ, భూక్యా రమేష్, లక్ష్మీనారాయణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నల్ల చట్టాలను రద్దు చేయాలి

●రెండో రోజుకు చేరిన నిరహారదీక్షలు

ఖమ్మం లీగల్ జూలై 4: అమల్లోకి వచ్చిన నూతన నల్ల చట్టాలను రద్దు చేయాలని పలు న్యాయవాద సంఘాల నాయకులు డిమాండ్ చూస్తూ బుధవారం ఖమ్మం కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరహారదీక్షలను న్యాయవాదులు చేపట్టారు. రెండో రోజు ఏడునూతల శ్రీనివాసరావు, చింతనిప్పు వెంకట్, పి.అమర్‌చంద్, బిచ్చాల తిరుమలరావు, ఓరుగంటి శేషగిరిరావు, జె. హేమంతకుమార్, తౌఫిక్, శరత్‌బాబు, ఆర్.పావెల్ నిరహారదీక్ష చేపట్టారు. న్యాయవాదులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఎం నాయకుడు నున్నా నాగేశ్వరరావు లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్త న్యాయ చట్టాలతో సామాన్య ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోకుండా ఏకపక్షంగా అమలు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, ఐతం రవీంద్ర, ఆకుల శేఖర్‌బాబు, మేకల సుగుణరావు, ఉమామహేశ్వరరావు, వెంకయ్య, మీసాల వెంకటేశ్వరరావు, పట్టిబి, తన్నీరు పాపయ్య వివిధ లీగల్ సెల్ న్యాయవాదులు సీనియర్, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్, జూలై 4 : కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి అమలు చేస్తోన్న కొత్త న్యాయచట్టాలకు వ్యతిరేకంగా ఖమ్మం న్యాయవాదులు చేస్తోన్న దీక్షలో ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్, మణుగూరు న్యాయవాది తుళ్లూరి బ్రహ్మయ్య గురువారం పాల్గొన్నారు. ఖమ్మం బార్ అసోసియేషన్ చేస్తున్న దీక్షలకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కొత్త న్యాయ చట్టాలతో సామాన్య ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోకుండా ఏకపక్షంగా అమలు చేయడం దారుణమన్నారు. ఇప్పటికైన కొత్త న్యాయచట్టాలను రద్దు చేసి అందరికి ఆమోదయోగ్యమైన చట్టాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్టేట్ బార్ కౌన్సిల్ కొల్లి సత్యనారాయణ, ఖమ్మం బార్ న్యాయవాదులు పోట్ల మాదవరావు, ఏడునూతల శ్రీనివాసరావు, ఎండీ టౌఫిక్, రాయల పావెల్, హేమంత్‌కుమార్, కొలికొండ శరత్‌బాబు, కొలిపాక రమేష్‌బాబు, నిరంజన్‌రెడ్డి, ఓరుగంటి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న తుళ్లూరి బ్రహ్మయ్య

పెండింగ్ వేతనాలు చెల్లించేవరకు సమ్మె

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 4: ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించే వరకు సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్, ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీను తెలిపారు. గురువారం ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు నాలుగు నెలలు జీతాలు చెల్లించాలని కోరుతూ నిరవధిక సమ్మెను చేపట్టారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వైరా రోడ్డు మీదుగా జడ్పీ సెంటర్ మీదుగా ప్రదర్శన కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులతో పనిచేయించుకుని నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, విక్రం బండారు యాకయ్య వెంకటరమణ, విజయమ్మ, అంబేద్కర్, అంజలి, సీతారాములు, సత్యవతి, పద్మ, రాధ, ఉపేందర్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

నాసిరకంగా కళాశాల భవనం

» బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న విద్యార్థులు, లెక్చరర్లు » వర్షం పడితే కిందికి దిగుతున్న చెమ్మ

» కుంగిపోయిన ఫ్లోరింగ్, గోడలకు నెర్రెలు » నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిస్థితి

నేలకొండపల్లి, జూలై4: నేలకొండపల్లి కూసుమంచి రోడ్డులో పాలేరు పాతకాల్వ సమీపంలో రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన జూనియర్ కళాశాల భవనం అత్యంత నాసిరకంగా నిర్మించారు. వర్షం వస్తే స్లాబ్‌పై నీళ్ల నిలిచి కిందికి చెమ్మ దిగుతున్నది. అంతే గాకుం డా విద్యుత్ సరఫరా కోసం వేసిన పైపుల్లో నుంచి నీళ్ల కిందికి దిగుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. తలుపులు, కిటికీలు తీస్తే పట్టవు..పడితే రావని పేర్కొంటున్నారు. మొత్తానికి కాలేజీకి వచ్చే విద్యార్థులు తరగతి గదుల్లో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వివరాల్లోకి వెళితే రూ.2కోట్ల నాబార్డు నిధులతో విద్య మరియు సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్ఈడబ్ల్యుఐడీసీ) ఆధ్వర్యంలో నేలకొండపల్లిలో, నేలకొండపల్లికే చెందిన ఓకాంట్రాక్టర్ ద్వారా కాలేజీ భవనాలను నిర్మించారు. మొత్తం 16 గదులు, మరుగుదొడ్లు నిర్మించారు. ఇంతవరకు బాగానే ఉంది. అధికారులు భవనాన్ని స్వాధీనం చేసుకునే ముందే మొత్తం నాణ్యతా ప్రమాణాలను పరీక్షించి స్వాధీనం చేసుకోవాలి. కానీ కాలేజీ పాత భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితుల్లో నూతన భవనంలోకి మారినట్లు కాలేజీ ప్రిన్సిపల్ సత్యనారాయణ శాస్త్రి చెప్పారు.

2021 నవంబరులో కొత్త కాలేజీ భవనాన్ని స్వాధీనం చేశారు. నూతన భవనంలోకి కాలేజీ మారి ముచ్చటగా మూడేళ్లయ్యిందేమో. కొత్త భవనాల్లోకి వచ్చామన్న సంతోషం విద్యార్థులకు, లెక్చరర్లకు లేకుండా పోయింది. కారిడార్‌లో ఫ్లోరింగ్ ఓపక్కన పూర్తిగా కుంగి పోయింది. కాలేజీలోకి ప్రవేశించగానే ఎడమవైపు కారిడార్‌లోకి వెళ్లే వైపు గోడకు పెద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. ఓవైపు బండలు పగిలిపోయాయి. తరగతి గదులకు పెట్టిన తలుపులు, కిటికీలు కొంతమేర పాడైపోయాయి. కిటికీలకున్న చువ్వలు అక్కడక్కడా విరిగిపోయాయి. వర్షం పడితే లోనికి చెమ్మ దిగుతున్నది. కాలేజీలో నుంచి మరుగుదొడ్లకు వెళ్లేదారిని సక్రమంగా వేయలేదు. విద్యార్థులు భవనంపైకెక్కితే రక్షణగా ఉం డాల్సిన ప్రొటెక్షన్ ప్రహరీని నిర్మించలేదు. భవనంపై స్లాబు ఫ్లోరింగ్ చేయలేదు. దీంతో వర్షపు నీళ్ల నిలిచి స్లాబ్ మరమ్మతులకు గురవుతుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. పైన హెడ్‌రూం ట్యాంకును నిర్మించలేదని వాపోతున్నారు.


నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల (గోడకు నెర్రెలు ఉన్న దృశ్యం)

అధికారుల పర్యవేక్షణ లేకనే....

భవన నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ సరిగా లేక పోవడంతోనే కాంట్రాక్టర్ ఇష్టానురీతిన భవనాన్ని నిర్మించాడని తెలుస్తున్నది. కానీ అధికారులు మాత్రం కొన్ని లోటుపాట్లు ఉన్నప్పటికీ నిర్మాణం బాగానే ఉందంటున్నారు. కాలేజీ భవనాన్ని ఒక్కసారి జిల్లా కలెక్టర్ పరిశీలించాల్సిన అవసరం ఉందని కళాశాల సిబ్బంది పేర్కొనడం గమనార్హం.

పాత స్థానాల్లో చేరిన టీచర్లు

దుమ్ముగూడెం, జూలై 4: కెవీరభద్రాపురం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు టీచర్లతో పాటు మహదేవపురం యూపీఎస్ నుంచి ముగ్గురు ఎస్జీటీలు ప్రమోషన్‌పై రిలీవ్ కావడంతో విద్యార్థుల చదువులు పూర్తిగా అటకెక్కిన విషయమై ఈనెల 3న ఆంధ్రజ్యోతిలో 'చదువులు సాగేదెలా' అనే కథనం వెలువడింది. ఎంఈవో సమ్మయ్య ఆదేశాల మేరకు ముగ్గురు టీచర్లు తిరిగి విధుల్లో చేరారు. కెవీరభద్రాపురం పాఠశాల టీచర్లిద్దరికీ ప్రమోషన్ రావడంతో గత నెల 30న రిలీవ్ అయ్యారు. వీరి స్థానాలను భర్తీ చేసేందుకు ఇతర మండలాల నుంచి టీచర్లు రాకపోవడం, వీరిని రిలీవ్ చేయడంతో తలెత్తిన సమస్యను ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో ప్రమోషన్‌పై మండలం నుంచి రిలీవ్ అయిన ఇద్దరు టీచర్లు తిరిగి వారి పాత స్థానాల్లో చేరారు. అలాగే మహదేవపురం యూపీఎస్‌లో ఒక్క ఎస్జీటీ కూడా లేకుండా ఉన్న ముగ్గురిని ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లేందుకు రిలీవ్ చేశారు. రేషనలైజేషన్ నిబంధనల ప్రకారం అక్కడ ఎస్జీటీ ఆవశ్యకతను వెలుగులోకి తేవడంతో ముగ్గురిలో ఒకరిని వెనక్కు పిలిపించారు. వీరంతా ఈనెల 3, 4 తేదీల్లో విధుల్లో చేరారు.

బీజేపీ నుంచి పలువురి సస్పెండ్

● నియోజకవర్గ కన్వీనర్ గొట్టిపూళ్ల దుర్గా ప్రసాద్ వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

దమ్మపేట, జూలై 4: భారతీయ జనతాపార్టీ నుంచి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఆరుగురిని రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తున్నట్లు అశ్వారావుపేట నియోజకవర్గ కన్వీనర్ గొట్టిపూళ్ల దుర్గా ప్రసాద్ తెలిపారు. గురువారం దమ్మపేటలో జరిగిన బీజేపీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీకి వ్యతిరేకంగా పని చేయడంతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షుడి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో యువమోర్చా మండల అధ్యక్షుడు పల్లపు వెంకటేశ్వరరావు, గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వాసం పోలయ్య మాజీ దళిత మోర్చ జిల్లా అధ్యక్షుడు గూడా ముత్యాలరావు, మహిళా మోర్చ నాయకురాలు రత్నకుమారి, మండల అధ్యక్షుడిగా ప్రకటించుకున్న పూచిక ప్రసాదు, మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి నాగరాజులను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారు పార్టీలో ఏపదవిలో ఉన్న క్రమశిక్షణా చర్యలు తప్పవన్నారు. ఈసమావేశంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ కె.ముసలయ్య, ఎం. రాజు, ఉడతనేని విశ్వేశ్వరరావు, పసుమర్తి పుల్లారావు తదితరులు ఉన్నారు..

ట్యాక్స్ చెల్లింపులపై అవగాహన

ఖమ్మం మార్కెట్ , జూలై 4: జీఎస్టీ పన్నులు చెల్లించే వ్యాపారులకు జరిమానాతో పాటు వడ్డీ విషయంలో వెసులుబాటు కల్పించారని సెంట్రల్ జీఎస్టీ అధికారులు పేర్కొన్నారు. గురువారం నగరంలోని సెంట్రల్ జీఎస్టీ డివిజన్ కార్యాలయంలో జీఎస్టీ దినోత్సవ వేడుకలలో భాగంగా జరిగిన అవగాహన సదస్సులో జిల్లా టాక్స్ ప్రొఫెషనల్స్, అకౌంటెంట్స్‌కు వివరించారు. ఈ సందర్భంగా జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మరియదాస్ ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన 53వ కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలను వారికి తెలిపారు. జీఎస్టీలో తగ్గిన పన్ను స్లాబులపై, రిటర్న్‌లపై వారికున్న అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్‌లు నూతన్‌కుమార్, విజయ్‌పాల్, శేషగిరిరావు, శతీష్ చంద్ర, జిల్లా టాక్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ బాధ్యులు దుర్గాప్రసాద్, రామకృష్ణ, సైదులు, పవన్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



టాక్స్ ప్రొఫెషనల్స్‌ను వివరిస్తున్న జీఎస్టీ అధికారులు

కలుపు నివారణ కోసం మందు కొడితే..

మాడిపోయిన పత్తి...

» దుకాణ యాజమాని వేరే మందు ఇవ్వడంతోనే పంటకు నష్టం జరిగిందని బాధితుడిఆవేదన

» కామేపల్లి మండలం జాస్తిపల్లి సంఘటన

కామేపల్లి, జూలై 4: " కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందట" అన్న సామెత గుర్తుందా.. అలానే ఓ సంఘటన కామేపల్లి మండలం జాస్తిపల్లిలో జరిగింది.. జాస్తిపల్లికి చెందిన బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. రైతు యర్రబోయిన బసవయ్య తన కున్న నాలుగు ఎకరాలలో నెల క్రితం పత్తి విత్తనాలు నాటాడు. అడపదడప వర్షాలకు అవి మొలకెత్తాయి. వాటితో పాటు కలుపు కూడా పెరిగింది. ఆ కలుపు నివారణకు రైతు సాతానిగూడెంలోని శ్రీశ్రీనివాస పురుగు మందుల షాపు వెళ్లాడు. ఆ రైతు ఓ కంపెనీకి చెందిన కలుపు మందు ఇవ్వు అని అడగగా.. ఆరైతుకు షాపు యాజమాని ఆకంపెనీ కంటే మంచిది ఉందని చెప్పి, వేరే పురుగుల మందును ఇచ్చాడు. కాగా తన పొలంలో ఆ మందును పిచికారి చేశాడు. పిచికారి చేసిన నాలుగు గంటల లోపే ఆకు జాతి కలుపుతో పాటు పత్తి మొక్కలు మాడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో వెంటనే ఆషాపు యాజమానికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. అయితే ఆకంపెనీకి చెందిన ఉద్యోగులను పంపిస్తా వాళ్ల వచ్చి చూసి చెబుతారు అని తెలిపినట్లు ఆరైతు తెలిపాడు. అంతే కాకుండా ఆరైతుతో పాటు అదే గ్రామానికి చెందిన రైతులు మేకల బాలకృష్ణ, ముత్తయ్యలు కూడా ఇదే మందు తెచ్చారు. ముందుగా బసవయ్య పిచికారి చేశాడు. ఆతరువాత మిగత ఇద్దరు రైతులు కూడా పిచికారి చేశారు. బసవయ్య పత్తి చేను మాడి పోయిందని తెలుసుకొని మిగత ఇద్దరు దానికి విరుగుడికి మరో మందు పిచికారి చేశారు. ఆఇద్దరు రైతులకు కొంత మేరకు నష్టం వాటిల్లింది. సుమారుగా రూ.50వేలకు వరకు నష్టం వాటిల్లిందని రైతు పేర్కొన్నాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరాడు.. ఈ విషయంపై కామేపల్లి ఏవో తారాదేవిని వివరణ కోరగా.... ఈ విషయమై దృష్టికి వచ్చింది, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి తగు చర్యలుకు తీసుకుంటామని తెలిపారు.


మాడిపోయిన పత్తి చేను చూపిస్తున్న బాధిత రైతు


మాడిపోయిన పత్తి మొక్క

పదోన్నతిపై టీచర్ బదిలీ..
భావోద్వేగానికి గురైన విద్యార్థులు

లక్ష్మీదేవిపల్లి, జూలై4: మండల పరిధిలోని శ్రీనగర్ గ్రామ పంచాయతీ ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు ఎం. జ్యోతిరాణి బొమ్మనపల్లి పాఠశాలకు హెచ్‌ఎంగా పదోన్నతిపై బదిలీ కావడంతో గురువారం జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ఆ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయురాలు భావోద్వేగానికి గురయ్యారు. 11 ఏళ్ల నుంచి ఆ పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయురాలు తమను విడిచి వెళ్లిపోతుందని విద్యార్థులు ఆందోళన చెందారు. పాఠశాలతో తనుకున్న అనుబంధాన్ని తలుచుకుంటూ ఆ ఉపాధ్యాయురాలు జ్యోతిరాణి సైతం భావోద్వేగానికి గురయ్యారు. పాఠశాలను రాష్ట్రంలోనే ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దిన ఘనత ఆమెకు దక్కుతుందని స్థానికులు, వివిధ సంఘాల నాయకులు గుర్తు చేసుకుంటూ ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ జిల్లా మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, ఎంఈవో జుంకిలాల్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జడ్పీటీసీ మేరెడ్డి వసంత, శ్రీనగర్‌కాలనీ మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ లగడపాటి రమేష్‌చంద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, కౌన్సిలర్లు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


భావోద్వేగానికి గురైన విద్యార్థులు, ఉపాధ్యాయురాలు

రేపు కొత్తగూడెంలో
ఉమ్మడి జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలు

చుంచుపల్లి, జూలై4: ఉమ్మడి ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల జూనియర్, సబ్ జూనియర్ స్విమ్మింగ్ పోటీలను శనివారం కొత్తగూడెం కోర్టు పక్కన గల సీఈఆర్ క్లబ్‌లో నిర్వహిస్తున్నామని అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జి.హన్మంత రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల క్రీడాకారులకు వివిధ విభాగాలలో స్విమ్మింగ్ పోటీలను నిర్వహించి, ప్రదర్శన కనబరిచిన వారిని ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 13వ తేదీ, 14వ తేదీలలో సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు నెంబర్ 98669 23395, 99080 53539లను సంప్రదించాలని కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

సత్తుపల్లిరూరల్, జూలై4: సత్తుపల్లి పట్టణ శివారులోని వెంగళరావు నగర్ సమీపంలో పేకాట ఆడుతున్న సమాచారం అందడంతో గురువారం రాత్రి తన సిబ్బందితో దాడి చేసినట్లు పట్టణ సీఐ టీ.కిరణ్ తెలిపారు. దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.4వేల నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కాగా ఈ దాడుల్లో నలుగురు తప్పించుకుని పరారైనట్లు తెలిపారు.

మసక బారుతున్న ఘనత

» చింతకాని తహసీల్దార్ కార్యాలయంలో వరుస వివాదాలు

» జిల్లా అధికారుల మన్ననలు పొందిన గత తహసీల్దార్లు

చింతకాని, జూలై 4: చింతకాని తహసీల్దార్ కార్యాలయంలో గతంలో పనిచేసిన అధికారులు ఉత్తమ అధికారులుగా మన్ననలు పొంది జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులచే ప్రశంసలు పొందారు. కానీ ఇటీవల కొన్ని వరుస ఘటనలతో కార్యాలయం ఘనత మసకబారుతోంది. అధికారులు క్షేత్రస్థాయిలో భూ, రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించకుండ, కార్యాలయాలకే పరిమితం కావడం, అధిక సమయం రిజిస్ట్రేషన్ కార్యాక్రమాలకే ప్రాధాన్యత ఇస్తుండటంతో గ్రామాల్లో పలు భూసమస్యలు పేరుకుని పోయి అవి అధికారుల సీటుకు గండంగా మారుతున్నాయి. కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్, కిందిస్థాయి ఉద్యోగుల పెత్తనంతో పాటు ఎక్కువ మంది సిబ్బంది గ్రామస్థాయి వీఆర్‌ఏల నుంచి ప్రమోషన్లు పొంది విధులు నిర్వహిస్తుండటం, రెవెన్యూ సమస్యలపై పట్టు లేకపోవడంతో పలు సమస్యలపై వచ్చిన అర్జీదారులు, లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కార్యాలయంలో జరుగుతున్న ఘటనలపై స్థానిక నేతలు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం


చింతకాని తహసీల్దార్ కార్యాలయం

నిత్యం ఉత్పన్నమవుతున్న భూసమస్యలు

చింతకాని మండల కేంద్రంతో పాటు గ్రామాలు జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉండటం, జిల్లా కలెక్టర్ కార్యాలయం కూతవేటు దూరంలో ఉండటమే కాకుండా, చింతకాని మండల గుండా సూర్యాపేట-దేవరపల్లి, నాగపూర్-అమరావతి జాతీయ రహదారులు వెళ్తుండటంతో రియల్ ఎస్టేట్ భూమ్ పెరిగి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. భూముల ధరలకు పెరగడంతో పాటు, సమాంతరంగా భూవివాదాలు కూడా రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇలాంటి మండలంలో రెవెన్యూ అధికారులు అప్రమత్తతో పనిచేయాల్సిన అవసరం ఉంది.

కార్యాలయంలో మధ్యవర్తులదే రాజ్యం

తహసీల్దార్ కార్యాలయంలో మధ్యవర్తులదే హవా నడుస్తోంది. రిజిస్ట్రేషన్లు, ధ్రువీకరణపత్రాలు ఇలా.. ఏది కావాలన్నా ఏజెంట్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. సామాన్యుడు కార్యాలయానికి నేరుగా వెళ్తే పనికాదు. కానీ ఏజెంట్లను నమ్ముకుంటే పని ఇట్టే సులువుగా అయిపోతుంది. వివాదాస్పద భూములు రిజిస్ట్రేషన్ విషయంలో వారిదే కీలకపాత్ర. వివాదస్పద భూముల విషయంలో క్రయవిక్రయదారుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసిన ఘటనలు చాలానే ఉన్నాయి. ఇలా ప్రతి విషయంలో ఏజెంట్ల పాత్ర ఉండటం, సామాన్యుడు కార్యాలయంలోకి స్వేచ్ఛగా వెళ్లి పనిముగించుకోవడం ఈ కార్యాలయంలో కళగానే మిగిలిపోతుంది. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కొడుతున్నాడని భర్తపై భార్య ఫిర్యాదు....

పోలీస్‌స్టేషన్ ఎదుట భర్త ఆత్మహత్యాయత్నం

● దుమ్ముగూడెంలో ఘటన

దుమ్ముగూడెం జూలై 4: కొడుతున్నాడని భర్తపై భార్య ఫిర్యాదు చేయడంతో, మనస్తాపంతో ఆ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంకాశీనగరానికి చెందిన చింతం ఎబినేజర్‌కు అతడి భార్య సలోమిల మధ్య జరుగుతున్న ఘర్షణల కారణంగా మండలంలోని సత్యనారాయణపురంలో ఆమె ఆరు నెలలుగా నివాసం ఉంటోంది. కాగా గురువారం మహిళా స్వయం సమృద్ధి గ్రూపు రుణం విషయమై మాట్లాడేందుకు ఆమె ఎంకాశీనగరం వచ్చి స్థానికంగా తెలిసిన వాళ్లింట్లో ఉంది. ఇది తెలుసుకున్న అతడు ఊర్లోకి ఎందుకు వచ్చావంటూ, ఆమెతో ఘర్షణ పడి కొట్టినట్లు తెలుస్తోంది. తనను భర్త అకారణంగా కొట్టాడంటూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారించేందుకు పోలీసులు అతడిని స్టేషన్‌కు పిలిపించారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అతడు పోలీసులను కూడా దూషిస్తూ, బయటకు పరుగెత్తి స్టేషన్ ఆవరణలో ఉన్న తన ద్విచక్రవాహనంలో దాచి ఉంచిన క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన పోలీసులు వెంటనే అతడిని వైద్య చికిత్సల కోసం ములకపాడు పీహెచ్‌సీకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఎబినేజర్‌ను పోలీసులెవరూ చిన్న మాట కూడా అనలేదని సీఐ అశోక్ తెలిపారు. మద్యం మత్తులో ఉన్న అతడు బెదిరించడానికో, లేక భయపడో పురుగుల మందు తాగి ఉండొచ్చని పేర్కొన్నారు. పథకం ప్రకారం ఇలా చేశాడని పోలీసులు భావిస్తున్నారు.


పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఎబినేజర్

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 4: "వర్షాలతో ఆస్తి, ప్రాణ నష్టం జరక్కుండా చూడాలి.. సీజనల్ వ్యాధుల నియంత్రణకు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని" కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విపత్తుల పట్ల ముందస్తు ఏర్పాట్లతో అధికారులు సన్నద్ధంగా ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రజలకు కష్టం కలగకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. వర్షాలు వచ్చినప్పుడు ముంపు ప్రాంతాలు, ప్రమాదకర నీటి వనరుల పట్ల ముందస్తుగా మ్యాపింగ్ చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మండల, మునిసిపాలిటీ స్థాయిలో ఆయా పరిధిలో ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయో గుర్తించి, వాటిని నివారించాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతానికి చేర్చాలని, దీనికోసం ప్రతి గ్రామంలో ఒక భవనాన్ని గుర్తించి సిద్ధంగా ఉంచాలన్నారు. మురిగు కాల్వను మొదటి నుంచి చివరి వరకు పరిశీలించాలన్నారు. ప్రతి మురికికాల్వలో పూడిక తీయాలని కోరారు. విపత్తు సంభవిస్తే, వార్డు, గ్రామ స్థాయిలో ప్రత్యేక అధికారిని కేటాయించి, ఆ అధికారి ఫోన్ నెంబర్ ఆ గ్రామంలో విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. వార్డు, గ్రామ పంచాయతీలో మందులు స్టాక్ లో ఉంచాలన్నారు. నీటి నిల్వలు ఉండకుండా, అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం లేకుండా డ్రెయిన్ ను శుభ్రంగా ఉంచడం పారిశుద్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. వీధుల వెంట బ్లీచింగ్, ఫాగింగ్ చేయాలన్నారు. ఫీవర్ సర్వే చేపట్టి, వైద్య శిబిరాల నిర్వహించాలని ఆదేశించారు.జిల్లాలో ప్రతి వారం డ్రై డే ను పకడ్బందీగా చేపట్టాలని, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు పక్కాగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో విఓలతో సమావేశాలు నిర్వహించి, ముందస్తు చర్యలపై అవగాహన కల్పించాలని, ఈ సమావేశాల్లో వైద్యాధికారులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సురక్షిత త్రాగునీరు అందేలా చూడాలని, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల క్లినింగ్, క్లోరినేషన్ క్రమం తప్పకుండా చేపట్టాలని, మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలు లేకుండా నియంత్రించాలన్నారు. నిల్వ నీటిలో దోమలను అరికట్టేందుకు ఆయిల్ బాల్స్ సిద్ధం చేసుకోవాలని, దోమల వ్యాప్తి చెందకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. మిషన్ భగీరథ సర్వే ఈ నెల 10 లోగా పూర్తిచేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు సమన్వయంతో అన్ని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఆర్డీవో సన్యాసయ్య, జెడ్పీ సీఈవో ఎస్. వినోద్,డీపీవో హరికిషన్, ఉప జిల్లా వైద్యఅధికారి డా. సైదులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మావోయిస్టులకు వ్యతిరేకంగా
పోస్టర్ల కలకలం


యానంబైలు గ్రామంలో పల్లెదవాఖానా గోడకు అంటించిన పోస్టర్లు

పాల్వంచ, జూలై4: మావోయిస్టుల ప్రజా వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా మరోసారి పాల్వంచ మండలంలో గురువారం రాత్రి పోస్టర్లు వెలిశాయి. పెట్రోలింగ్ విధుల్లో భాగంగా యానంబైలు, ఉల్వనూరు, బంజర, చంద్రాలగూడెంలలో సంచరిస్తున్న పోలీసులకు పోస్టర్లు దర్శనమిచ్చాయి. అవి మావోయిస్టులకు వ్యతిరేకంగా ఉండటం, గత వారం కూడా ఇదే తరహాలో పోస్టర్లు దర్శనమిచ్చి ఉండటంతో అది కాస్తా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.. మావోయిస్టుల అరాచకాలకు అమాయక ఆదివాసీలు బలవుతున్నారని, మావోయిస్టులు పోలీసులకోసం అమర్చే మందుపాతరలకు అమాయక గిరిజనులు బలవుతున్నారని, వారి క్రూరత్వం రోజు రోజుకూ మితిమీరుతుందని అందులోని సారాంశం. మావోయిస్టుల స్వార్థప్రయోజనాల కోసం పేదలను బలి చేస్తున్నారని, నిజ నిర్ధారణ పేరుతో హడావుడి చేసే ప్రజాసంఘాలు, మహిళా సంఘాల బాధ్యులు ఇలాంటి విషయాల్లో మౌనంగా ఉండటం బాధాకరమని అందులో పేర్కొనడం విశేషం. గుర్తు తెలియని వ్యక్తులు మండల వ్యాప్తంగా ఉన్న గిరిజన గ్రామాల్లో ఈ పోస్టర్లను వెదజల్లారని, కొన్ని చోట్ల గోడలకు అంటించారని రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

మహిళపై మహిళ కత్తితో దాడి

● ఆసుపత్రికి తరలించిన స్థానికులు ● రుద్రంపూర్‌లో ఘటన

చుంచుపల్లి, జూలై4: మహిళపై ఓ మహిళ కత్తితో దాడి చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కొత్తగూడెం టూటౌన్ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల సమీపంలో బాధితురాలు శిరీష తన ఇద్దరు పిల్లలు, భర్తతో కలిసి జీవిస్తుంది. ఇదే ప్రాంతంలోని ఎదురుగడ్డకు చెందిన పావని అనే మహిళ మాస్క్ ధరించి గురువారం శిరీష ఇంటికి వెళ్లింది. ఇంట్లోకి చొరబడ్డ పావని బాధితురాలు శిరీషపై విచక్షణ రహితంగా కత్తితో దాడి చేసింది. ఇది చూసిన బాధితురాలి పిల్లలు కేకలు వేస్తూ భయాందోళనతో బయటికి వెళ్లి, స్థానికులకు తన తల్లిపై పావని అంటి వచ్చి దాడి చేస్తున్నట్లు చెప్పారు. దీంతో స్థానికులు ఇంట్లోకి వెళ్లిచూడగా కత్తితో వారిపైకి రావడంతో వారు ప్రతిఘటించారు. దీంతో కత్తిని అక్కడ వదిలివేసి ఆమె పారిపోయింది. తీవ్ర గాయాలైన బాధితురాలిని స్థానికులు, కుటుంబ సభ్యులు కొత్తగూడెం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులకు సమాచారం అందించగా, సంఘటన స్థలానికి చేరుకొని, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. దాడికి పాల్పడిన మహిళ పావనిని వెతికేందుకు పోలీసుల బృందం దర్యాప్తు చేస్తుందని, అసలు వారిద్దరి మధ్య సంఘటనకు కారణాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.


దాడిలో గాయపడిన శిరీష

లచ్చగూడెంలో వివాదాస్పద భూమి రిజిస్ట్రేషన్‌పై ఆరా

చింతకాని, జులై 4: తనకు పసుపు కుంకుమ కింద ఇచ్చిన భూమిని తనకు తెలియకుండా తన బోబుట్టువులకు రిజిస్ట్రేషన్ చేశారని మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన చింతాల వెంకట్రామ్మ గత బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆందోళన నిర్వహించిన సంగతి తెలిసిందే... తోబుట్టువుల కుటుంబ తగాదాలో ఉన్న వివాదాస్పద భూమి రిజిస్ట్రేషన్ విషయమై గురువారం నిఘా వర్గాలు ఆరా తీశాయి. రిజిస్ట్రేషన్ ఎప్పుడు జరిగింది, ఎవరి పేరున రిజిస్ట్రేషన్ చేశారు, తల్లి ఆస్తి కుమారుల కుటుంబాలకు ఎందుకు కొనుగోలు రూపంలో రిజిస్ట్రేషన్ చేయాల్సి వచ్చింది అనే విషయాలపై ఆరా తీసినట్లు సమాచారం.

వ్యక్తిపై దాడి: ముగ్గురిపై కేసు నమోదు

ఖమ్మం రూరల్, జూలై 4: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై కొందరు దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని చింతపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. చింతపల్లి గ్రామానికి చెందిన యాదగిరి గురువారం తన గేదెలను మేతకు తోలుకుని వెళ్తుండగా, పాత కక్షలను మనసులో పెట్టుకుని అదే గ్రామానికి చెందిన చిన్న ఏసు, ఉపేందర్, నాగరాజులు కలిసి అత డిపై కర్రలతో దాడి చేశారు. ఈ సంఘటనపై బాధితుడు యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

చర్ల, జులై 4: ఉరేసుకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని లక్ష్మీకాలనీ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చర్ల మండలం అంబేద్కర్‌నగర్‌కు చెందిన మామిడి కృష్ణ (37) అనే వ్యక్తి గురువారం లక్ష్మీకాలనీ శివారులోని చెరువు వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా కృష్ణ చర్లలో కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. చర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతికిగల కారణాలు తెలియాల్సి ఉంది.

అనారోగ్యంతో ఒకరు..

ఖమ్మం రూరల్, జూలై 4: అనారోగ్య కారణాలతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని ఆరెంపుల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరెంపుల గ్రామానికి చెందిన షబ్బీర్ (49) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి అలవాటు పడ్డాడు. అనారోగ్య పరిస్థితిని తట్టుకోలేక బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్య మత్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి...

ఖమ్మం రూరల్, జూలై 4: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖమ్మం రూరల్ మండలం, పెద్దతండా పరిధిలోని లక్ష్మీబృందావనం కాలనీలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీబృందావనం కాలనీలో నివాసం ఉంటున్న విశ్రాంత ఉద్యోగి గోపాల్ రెడ్డి (65) కుటుంబంలో కొంతకాలంగా ఘర్షణలు జరుగుతున్నాయి. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం, జూలై4: రైలు నుండి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం ఖమ్మం నగరంలో రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. నగర శివారులోని దానవాయిగూడెం సమీపంలో రైల్వేట్రాక్ పక్కన గుర్తు తెలియని రైలు కింద గుర్తు తెలియని వ్యక్తి జారిపడి మృతి చెందాడు. అది గమనించిన రైల్వేసిబ్బంది జీఆర్‌పీ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలం వద్ద మృతదేహాన్ని పరిశీలించి, అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

చికిత్స పొందుతూ వెల్డర్ ....

అశ్వారావుపేట రూరల్, జూలై 4: ప్రమాదవశాత్తూ ఇంటి పైకప్పు నుంచి పడి వెల్డర్ మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. ఎస్ఐ శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రాలోని పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఎస్‌కే షరీఫ్(52) గత కొంతకాలంగా అశ్వారావుపేటలో వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో బుధవారం మండలంలోని వాగొడ్డుగూడెంలో ఓఇంటిపై రేకులు వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ జారీ కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని రాజమండ్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
శుక్రవారం 5 జూలై 2024

సంపూర్ణ అభియాన్ కార్యక్రమం ప్రారంభం

కొత్తగూడెం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నీతి అయోగ్ అస్పిరేషనల్ జిల్లా, అస్పిరేషనల్ మండలం ఆకాంక్షిత కార్యక్రమంలో భాగంగా గురువారం ఐడీవోసీ కార్యాలయంలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సందర్శించారు. సమగ్ర అంగన్‌వాడీ సేవలను, విధి విధానపాలను బొమ్మల రూపంలో చూపించిన శ్రీ శిశు సంక్షేమశాఖను కలెక్టర్ అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమంలో భాగంగా సంపూర్ణత అభియాన్‌లో పేర్కొన్న అన్ని సూచికలను సంపూర్ణంగా సాధించి జిల్లాను ఆకాంక్షిత జిల్లా నుంచి స్ఫూర్తిదాయక జిల్లాగా మార్చాలని అన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మునగ, వెల, కరివేపాకు, చింత, ఉసిరిమొక్కలు నాటాలని, ఈ మొక్కల ద్వార ఎన్నో పోషకాలు అందుతాయని తెలిపారు. గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందించాలని కోరారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

నీట్‌పై నిరసన వ్యక్తం చేసిన విద్యార్థి సంఘాలు

చుంచుపల్లి, జూలై 4: నీట్ పేపర్ లీకేజీను నిరసిస్తూ.. దేశ వ్యాప్తంగా చేపట్టిన విద్యా సంస్థల బంద్ కొత్తగూడెం, చుంచుపల్లి ప్రాంతాలలో గురువారం ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, కళాశాలల తరగతులను పూర్తిగా బహిష్కరించారు. ఈ బంద్‌ను విజయవంతం చేసినందుకు అధికారులకు పాఠశాల, కళాశాల యాజమాన్యానికి ఎస్ఎఫ్ఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి వీరభద్రం, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ ప్రధాన కార్యదర్శి మందా నందా కృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.షాహీం, డివైఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కాశంగి హరికృష్ణ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కాపాటి పృథ్వీ, నాయకులు నరాల రాజేష్, గౌతమ్, శశి వర్ధన్, మోహన్‌మాలిక్‌దీపక్, సర్దాం, తరుణ్, సీహెచ్.రామచరణ్, వాడె సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేట: విద్యాసంస్థలో సమస్యలపై వామపక్ష పార్టీల విద్యార్థి సంఘాల పిలుపుమేరకు గురువారం పట్టణంలోని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. దేశవ్యాప్తంగా పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్‌ఐల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులను బైటకు పంపి, వారితో కలసి ప్రదర్శన చేసారు. డీఎస్సీని 45 రోజులు వాయిదా



'పేట'లో పాఠశాల బయటకు వస్తున్న విద్యార్థులు

వేయాలని, టెట్ నార్మలైజేషన్, ఉద్యోగ కాలెండర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేసారు.

భద్రాచలంలో..

భద్రాచలం: విద్యారంగ సమస్యల పరిష్కారానికి గురువారం తలపెట్టిన పాఠశాలల బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు యఎస్ భూపేందర్, కార్యదర్శి శివ ప్రసాద్ పేర్కొన్నారు. నీట్ ఫలితాల అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో రవీంద్ర, చందు వర్దన్, సురేష్, నాగకృష్ణ పాల్గొన్నారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వంశీ, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జమ్మి యశ్వంత్ డిమాండ్ చేశారు. విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం మండలంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. సంఘాల నాయకులు ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలను మూసివేయించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ జూలూరుపాడు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.



జూలూరుపాడులో నిర్వహించిన ఆందోళన

పాఠశాలలను తనిఖీ చేసిన కలెక్టర్



గడ్డి చెక్కుతున్న కలెక్టర్

టేకులపల్లి, జూలై 4: మండలంలోని ముత్యాలంపాడు స్టేజిలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, కోయగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలలను గురువారం కలెక్టర్ జితేష్ జి. పాటిల్ సందర్శించారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులు పరిశీలించారు. ప్రీస్కూలు పిల్లల హాజరు, గర్భిణులు, బాలింతల హాజరు నమోదు, ఎన్‌హెచ్‌టీఎస్ మొబైల్ యాప్‌లను పరిశీలించారు. అంతేకాకుండా అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న పిల్లల ఎత్తులు, బరువులు స్వయంగా పరిశీలించారు. పిల్లల పెరుగుదల పర్యవేక్షణను క్రమంగా చేపట్టి ఖచ్చితమైన పిల్లల ఎత్తులు, బరువులు నమోదు చేయాలని అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటాపాటలతో పాటు ప్రాథమిక విద్యను అందించాలని అన్నారు. షామ్, మామ్ పిల్లలను గుర్తించి వారికి వారికి పౌష్టికాహారం, బాలామృతం ఇవ్వాలని ఆయన సూచించారు. ప్రక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలను సందర్శించి పరిశీలించారు. విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. రెండు, మూడవ తరగతి విద్యార్థులతో వారి పేర్లను రాయించి వారి పరిజ్ఞానాన్ని తెలుసుకొనే ప్రయత్నం చేశారు. విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులను ఆయన అందచేశారు. అనంతరం కోయగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనుప్రకారం భోజనం అందుతుందోలేదో అడిగి తెలుసుకొన్నారు. పాఠశాలలో మరమ్మతులకు గురైన స్టీం కుకింగ్ సిస్టంను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణను ఆయన పరిశీలించి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి ఉపాధ్యాయులను ఆయన సున్నితంగా మందలించారు. ఆవరణ మొత్తం పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో ఉండటంతో ఎందుకు శుభ్రం చేయలేదని హెచ్‌ఎంను ప్రశ్నించారు. కూలీల కొరతవల్ల శుభ్రం చేయలేదని హెచ్‌ఎం అమర్‌సింగ్ తెలిపాడు. దీంతో మనింట్లో ఇట్లా ఉంటే ఎలా ఉంటుంది. పాఠశాల కూడ మన ఇల్లు లాంటిదే మన పనులు మనమే చేసుకోవాలంటూ కలెక్టరే పార తీసుకొని పిచ్చిమొక్కలు గడ్డి తొలగిస్తూ ఉపాధ్యాయులు కూడ ఇలా చేయాలని సున్నితంగా మందలించారు.

ఆధునిక వ్యవసాయంపై దృష్టిసారించాలి

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించి అధిక లాభాలు పొందాలని కలెక్టర్ జితేష్ జి పాటిల్ అన్నారు. గురువారం మండలంలోని కోయగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేసి తిరిగి వెళ్లుతున్న క్రమంలో శాంతినగర్ గ్రామ సమీపంలో ప్రధాన రహదారి ప్రక్కనే మిర్చిచేలో అరకతో పాటు చేస్తున్న రైతు కన్పించడంతో కలెక్టర్ కారుదిగి రైతు వద్దకు వెళ్లాడు. అక్కడ శాంతినగర్ గ్రామానికి చెందిన రైతు చేతుల కన్నయ్యను కలెక్టర్ పలకరించారు. ఆధునిక వ్యవసాయ పద్దతులపై మొగ్గుచూపాలని కోరారు.

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా



ఆందోళన నిర్వహిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

మణుగూరుటౌన్, జూలై 4 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులను ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ మణుగూరు ఏరియా ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయుసీ ఆధ్వర్యంలో గురువారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి గట్టయ్య మాట్లాడారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వ స్పందించకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్ అందించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి

పాల్వంచ టౌన్, జూలై 4: ప్రభుత్వం గతంలో అంగీకరించిన విధంగా న్యాయబద్ధంగా అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్‌కు రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె. బ్రహ్మాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో 10ని రద్దు చేయాలని గతంలో ప్రభుత్వం ప్రకటించిన విధంఆ అంగన్‌వాడీటీచర్, హెల్‌పరకు జీతాలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాయలం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా టీచర్స్, హెల్పర్స్‌కు జూలై 24 తర్వాత తక్కువ డబ్బులు చెల్లించి ఇంటికి పంపే నిర్ణయాన్ని రాష్ట్రప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క టీచర్‌కు రూ.2లక్షలు, హెల్పర్‌కు లక్ష రూపాయలు, రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ ఇస్తామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట తప్పితే పోరాటం తప్పదని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందచేశారు.



మాట్లాడుతున్న బ్రహ్మాచారి

ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. పద్మ, అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ, సీఐటీయూ జిల్లాసహాయ కార్యదర్శి కే. సత్య, ఎం. విజయశీల, వీరభద్రమ్మ, పాయం రాధకుమారి, సూరమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

చిన్న పిల్లలను పనులకు పెడితే చర్యలు

ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు టౌన్, జూలై 4: చిన్న పిల్లలను పనుల్లో పెట్టుకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లెందు డీఎస్పీ ఎన్. చంద్రభాను హెచ్చరించారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని వారిని ఎటువంటి పనుల్లోకి తీసుకోకూడదన్నారు. సైకిల్, మోకానిక్ షాపులు, ఇటుకబట్టీలతోపాటు వివిధ ప్రాంతాల్లో పిల్లలతో పని చేయిస్తే వారిపై చట్టపరమైనచర్యలు తప్పవన్నారు. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా ఇల్లెందు సబ్ డివిజన్‌లోని ఇల్లెందు, టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన టీం ద్వార పర్యటన చేసి బాలబాలికల చేత పనులు చేయించే వారిని గుర్తిస్తామన్నారు. ఎక్కడైన డ్రాప్ అవుట్స్ ఉంటే వారిని పాఠశాల, కళాశాలలో చేర్పిస్తామని తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు ఆపరేషన్ ముస్తాన్ ఉంటుందని వెల్లడించారు. ఈ ఆపరేషన్‌కు ప్రజలు సహకరించాలని సూచించారు. ముస్కాన్ టీంలో ఎస్ఐతోపాటు ఏడుగురు సభ్యులు ఉంటారని వారు నెలరోజులు సబ్ డివిజన్‌లో పర్యటిస్తారని పేర్కొన్నారు.

పోస్ట్‌మాస్టర్‌కు ఎమ్మెల్యే పరామర్శ



లాల్ అహ్మద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట, జూలై 4: అనారోగ్యంతో బాధపడతూ శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న పోస్టుమాస్టర్ మహ్మద్ లాల్ అహ్మద్‌ను గురువారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరామర్శించారు. ఆయనకు ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతోపాటు ముబారక్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కమ్యూనిటీ కాంటాక్టు నిర్వహించిన పోలీసులు

మణుగూరు, జూలై 4: మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని బాపనకుంట, శివలింగాపురం గ్రామాల్లో మణుగూరు డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ సతీష్ కుమార్ పోలీసు స్పెషల్ పార్టీ సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటిని సోదాలు చేశారు. ఇండ్లలో నిసముండే వారి వివరాలు, కొత్తవ్యక్తులు ఎవరైనా వచ్చారా అన్న వివరాలను సేకరించారు. అలాగే సరైన ధృవీకరణ పత్రాలు లేని 20 వాహనాలను స్టేషన్‌కు తరలించారు.

ప్రజల రక్షణ కోసం కమ్యూనిటీ కాంటాక్టు

ప్రజలకు రక్షణ కొసమే కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమాన్ని నిర్వహించామని మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు. అనుమానిత ఇళ్లను పరిశీలించి కొత్తవారి వివరాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలు, పేలుడు పదార్థాలు ఎమైనా ఉన్నాయన్న విషయంపై పోలీసు అధికారులు ఆరా తీశారన్నారు. ప్రజలు సురక్షితంగా ఉండేందుకు వారికి రక్షణ కల్పించే చర్యల్లో బాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. అనంతరం కొత్త చట్టాలు, సైబర్ నేరాలపై పలు కూడళ్లలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సతీష్‌కుమార్‌లు ప్రజలకు అవగాహణ కల్పించారు. కొత్త చట్టాలపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం సీఐ అశోక్ రెడ్డి ఎస్ఐలు తిరుపతి సురేష్, కరకగూడెం ఎస్ఐ రాజేందర్, ఏఎస్ఐ జ్యోతి మోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మణుగూరు డీఎస్పీ రవీందర్

రూ.26.45 లక్షలు పలికిన వారపు సంత

బూర్గంపాడు, ఏప్రిల్ 4: బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర పంచాయతీలో నిర్వహించే వారపుసంత వేలంపాటను ఆధికారులు గురువారం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలంపాటలో 8మంది పాల్గొనగా అశ్వాపురం మండల కేంద్రానికి చెందిన తేజావత్ కోటేశ్వరరావు అనే వ్యక్తి రూ.26.45లక్షలకు సంత పాటను దక్కించుకున్నాడు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సుదీప్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపీవో సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి భవాని పాల్గొన్నారు.

జ్వరపీడితుల గుర్తింపునకు ఇంటింటి సర్వే

జూలూరుపాడు, జూలై 4: మండలంలోని అనంతారం గ్రామంలో ప్రజలు విషజ్వరాల బారిన పడటంతో గురువారం వైద్యశాఖ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జ్వరం, ఒళ్ళునొప్పులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామంలో జ్వర పీడితులను గుర్తించేందుకు వైద్యాధికారి, ఎంపీవో, సిబ్బంది కలసి ఇంటింటి సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధులు బారిన పడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. 96 మందికి పరీక్షలు నిర్వహించి మందులను అందించి, 6గురు వద్ద నుంచి రక్తనమూనాలను సేకరించినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి బి. వెంకటేశ్వర్లు, ఎంపీఓ తులసీరాం, హెల్త్ సూపర్‌వైజర్ రత్న కూమార్, ఏఎన్ఎం సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే పనులు ప్రారంభించాలి

అశ్వారావుపేట రూరల్, జూలై 4: మండలంలోని ఐటీడీఏ పరిధిలో గల గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో తక్షణమే పనులు ప్రారంభించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదర్శ కమిటీల బాధ్యులకు సూచించారు. మండలంలోని 19 గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులను మంజూరు చేసింది. ఈనేపధ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వీవోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో సదుపాయాలకు మంజూరైన నిధుల్లో ఇప్పటికే 25శాతం గ్రాంటును బ్యాంకు ఖాతాల్లో జమచేశారని తెలిపారు. పాఠశాలల్లో రెండు రోజుల్లో పనులను ప్రారంభించి ఈనెల 15 నాటికి పూర్తయ్యేలా చూసుకోవాలని తెలిపారు. పనులను నిరంతరం చేయించాలని ఆదర్శ కమిటీల బాధ్యులకు సూచించారు.

ప్రజలకు సుపరిపాలన అందించాలి

జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు

చుంచుపల్లి, జూలై 4: భద్రాద్రి జిల్లా ప్రజలందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తూ సుపరిపాలనను చేరువ చేయాలని జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రోశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. గురువారం జడ్పీ కార్యాలయం సమావేశపు హాల్లో జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, వివిధ ప్రభుత్వ అధికారులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ శాఖల పని తీరు, అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారంలో సాధించిన పురోగతిపై సంబంధిత అధికారుల నివేధికను చదివి వినిపించగా పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్యంపై ప్రత్యేక ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. వ్యర్ధ పదార్థాలు, డ్రైనేజీల పరిశుభ్రత ఎప్పటికప్పుడు ఉండేలా ఈ వర్షాకాలంలో పని చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారికి సూచించారు. మహిళలకు రేషన్ షాపులలో, గర్భిణులు, బాలింతలకు, పసి పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించే క్రమంలో సన్న బియ్యం అందించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమౌతున్న నేపధ్యంలో రైతులు సాగు చేసుకుంటున్న పంటలపై వారికి అవగాహన కల్పిస్తూ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు మార్కెట్‌లో అందుబాటులో ఉండేలా చూడాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా నకిలీ విత్తనాల విక్రయాలు జరగకుండా చూడాలని కోరారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ కంచర్ల

మాజీ మంత్రి జలగంను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

భద్రాచలం, జూలై 4: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి జలగం ప్రసాదరావును భద్రాచలం బీఆర్ఎస్ నాయకులు కలిశారు. బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ జలగంను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సునీల్, రావులపల్లి పృథ్వీ, విశ్వనాధ్, రామకృష్ణ, దానియేలు ప్రదీప్, దన్నాన తరుణ్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణే ప్రధాన లక్ష్యం: ఏఎస్పీ



భద్రాచలం, జూలై 4: భద్రాచలం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియం త్రణే ప్రధాన లక్ష్యమని భద్రాచలం నూతన అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుగా వచ్చిన అంకిత్‌కుమార్ శంఖ్వార్ పేర్కొన్నారు. ఇటీవల భద్రాచలం ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రధానంగా గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపనున్నట్లు స్పష్టం చేశారు. భద్రాచలం దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతుండటంతో నిత్యం వేలాది మంది భక్తులు రామయ్య దర్శనం నిమిత్తం వస్తుంటారని ఈ క్రమంలో ఎటువంటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలతో సత్సంబంధాలను కొనసాగించడమే తమ లక్ష్యమన్నారు. శాంతిభద్రతలను కాపాడటమే ధ్యేయంగా పోలీసు శాఖ చర్యలు చేపడుతుందని ఈ క్రమంలో ప్రజలకు ఏదైనా సమాచారం వస్తే తన దృష్టికి తేవాలని కోరారు.

రైతు భరోసాపై భిన్నాభిప్రాయాలు

అశ్వారావుపేట, జూలై 4: రైతు భరోసా అమలుపై రైతుల అభిప్రాయాలను తెలుసుకునే కార్యక్రమంలో భాగంగా గురువారం వ్యవసాయ శాఖ, సొసైటీ ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయం తెలుసుకునేందుకు మహాజన సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు రైతులు, పలు పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసారు. ముందుగా సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సమావేశ ఉద్దేశ్యాన్ని వివరించారు. కొందరు రైతులు మాట్లాడుతూ పంటలు వేసుకొని సాగుచేస్తున్న ప్రతి ఎకరానికి రైతు భరోసను ఇవ్వాలని, 10 ఎకరాల లోపు రైతులందరికి తప్పనిసరిగ ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలని కోరారు. మరికొందరు రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు చెల్లింపుల్లో జాప్యం చేసేందుకే అభి ప్రాయాల సేకరణ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. సీపీఎం జిల్లా నాయకులు కె.పుల్లయ్య మాట్లాడుతూ కొండలు, గుట్టలు, ఖాళీ భూములు, రియల్ ఎస్టేట్ భూములను మినహాయించాలని, మిగతా వాటిలో పంట సాగుచేసే ప్రతి ఎకరానికి రైతు భరోసను అమలు చేయాలని కోరారు. రైతుభరోసకు ఐటీ రిటర్న్ నిబంధనలను తొలగించాలని కోరారు. ఎంపీపీ శ్రీరామమూర్తి మాట్లాడుతూ రైతు భరోసాను గత ప్రభుత్వం అమలు చేసిన విధానాన్ని యదాతధంగా అమలు చేయాలని కోరారు. సమావేశంలో తలో మాట మాట్లాడటంతో ఒకానొక దశలో సమావేశం గందరగోళంగ మారింది. వ్యవసాయ శాఖ ఏడీఏ అఫ్జల్ బేగం మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి పంపుతామని అంతిమ నిర్ణయం ప్రభుత్వమే తీసుకుంటుందని ఆమె అన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు ఆర్థిక సహాయం

కొత్తగూడెం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కార్పోరేట్ ఏరియా సివిల్ డిపార్టుమెంట్‌లో కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్న మాలోత్ శంకర్ తన ఇంటి వద్ద జారిపడటంతో తన రెండు కాళ్లు విరిగి గత నెల రోజుల నుంచి డ్యూటికి రాలేక ఆర్థిక ఇబ్బందుల పరిస్థితిని గమనించిన సివిల్ డిపార్టుమెంట్‌లోని అధికారులు, పర్మినెంట్ ఉద్యోగులందరు కలిసి సేకరించిన రూ. 23,400లను డీజీఎం (సివిల్) పి. రాజశేఖర్ మాలోత్ శంకర్ సతీమణి మలోత్ శంకేకే అందించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (సివిల్) పి. రాజశేఖర్‌తోపాటు ఎఐటీయూసీ కార్పోరేట్ జనరల్ సెక్రటరీ ఎస్‌వి. రమణమూర్తి, పిట్ సెక్రటరీలు, అధికారులు, సివిల్ డిపార్టుమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్త దాతలు ముందుకు రావాలి: ఎస్ఐ

కరకగూడెం, జూలై 4: మానవ సమాజంలో యువత రక్త దాతలుగా ముందుకు రావాలని ఆపదలో ఉన్న వారికి ప్రాణదాతలుగా నిలవాలని కరకగూడెం ఎస్ఐ రాజేందర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ.. భట్టుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 7న కరకగూడెం పోలీస్ శాఖ, భట్టుపల్లి గ్రామ యూత్, మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా రక్త శిబిరాన్ని విజయవంతం చేయాలని యువతను కోరారు. రక్త దానం చేయడం వలన గర్భిణీ స్త్రీలు, తల సేమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధులతో ఇబ్బంది పడుతున్న వారికి, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి ప్రాణదాతలుగా నిలవాలన్నారు. రక్తదానం మహాదానం అని అన్నారు. ప్రతీ ఒక్కరూ రక్తదాతలుగా మారాలని కోరారు. రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం చేసినట్టు అవుతుందని అన్నారు. ప్రాణాపాయంలో ఉన్న వారికి రక్తదానం చేయడం వల్ల ప్రాణం దక్కించిన వారము అవుతామని అన్నారు. అందుకే ప్రతీ ఒక్కరూ రక్తదాతలుగా మారాలని ఎస్ఐ రాజేందర్ కోరారు.

ముంపు గ్రామాలకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేకు వినతి

అశ్వాపురం, జూలై 4: మండల పరిధిలోని బట్టీలగుంపు గ్రామపంచాయతీలోని ముంపు గ్రామాలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ స్థానిక గిరిజనులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు గురువారం వినతిపత్రం సమర్పించారు. బట్టిగూడెంనుంచి రామ్‌నగర్ వరకు బీటీ రోడ్ మంజూరు చేయాలని, కరకట్టల నిర్మాణంలో ముంపునకు గురవుతున్న పంటచేలకు పరిహారం చెల్లించాలని, పంచాయతీలోని అన్ని గ్రామాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బట్టీలగుంపు మాజీ సర్పంచ్ బట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ అందజేత

చర్ల, జూలై 4: పాత చర్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం పెద్దాడ సత్యం జ్ఞాపకార్థం, భార్య, సుశీల. కుమార్తె రాధ అందజేసిన రూ.8వేలు విలువగల స్టేషనరీని విద్యార్థులకు అందజేశారు. వీటిని చర్ల నోడల్ ఆఫీసర్ పీవీ రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీహెచ్ వేణుగోపాలరావు చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాత చర్ల ప్రాథమిక పాఠశాల్లో పేద విద్యార్థులు ఉన్నారన్నారు. వారిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు నోట్‌బుక్స్, పెన్నులు, బ్యాగులు, కంబాక్స్‌లు అందించడం చాలా సంతోష కరమన్నారు. ఇలానే ప్రతీ ఒక్కరూ పేద విద్యార్థులకు సాయం అందించాలని సూచించారు. పెద్దాడ సత్యం అందించిన స్థలంలోనే నేడు ఈ పాటశాల నడుస్తుందని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.రాజేశ్వరి, ఎస్.రామారావు, ఈ.చంద్రయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



రామచంద్రయ్య కుటుంబానికి సాయం

దమ్మపేట, జూలై 4: పద్మశ్రీ అవార్డు గ్రహీత రామచంద్రయ్య కుటుంబానికి సోయం వంశీయుల తరుపున్న 15వేల రూ.ల ఆర్ధికసహాయాన్ని గరువారం మణుగూరు మండలం కూనవరం గ్రామంలోని ఆ కుటుంభ్యులను పరామర్శించి అందజేసారు. గిరిజన సంఘం నాయకుడు సోయం వంశీయల నాయకుడు దమ్మపేట మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన సోయం వీరభద్రం ఆర్థిక సహాయాన్ని అందజేసారు. ఈసందర్భంగా రామచంద్రయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతు కంచు మేళం పేరుతో ఆదీవాసీ సంప్రాదాయాలను, సమ్మక్క, సారక్క గానం చేసిన సకినం రామచంద్రయ్య మృతి ఆదివాసీలకు తీరని లోటన్నారు. ఆయన ఎంతో మందికి స్ఫూరిగా నిలిచారని నివాళులు అర్పించారు. ఆ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో పలువురు సోయం వంశీయులు వున్నారు.